తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice
వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
20-06-2026
శనివారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 132
PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి
People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

## తెలంగాణలో
# ఇంధన సెగ !

**దేశంలోనే అత్యధిక ధరలు ఇక్కడే..**

- దేశంలోనే అత్యధిక ధరలు ఇక్కడే..
- 200 లీటర్ల పరిమితితో రవాణా, వ్యవసాయ రంగాలు అస్తవ్యస్తం
- వ్యాట్ తగ్గించాలంటూ బీఆర్ఎస్ డిమాండ్..
- ఆంక్షల నేపథ్యంలో సరిహద్దు జిల్లాల్లోనూ ఇంధన కష్టాలు..



**(ప్రత్యేక ప్రతినిధి - సిరిన్యూస్) :**

అంతర్జాతీయంగా పశ్చిమ ఆసియా ఉద్రిక్తతల వల్ల చమురు సంస్థలు వరుసగా ధరలు పెంచడంతో తెలుగు రాష్ట్రాల్లో ఇంధన ధరలు గరిష్ట స్థాయికి చేరాయి. భారతదేశంలోనే అత్యధికంగా పెట్రోల్ ధరలు ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచింది. తెలంగాణలో పెట్రోల్‌పై దాదాపు 35.2 శాతం వ్యాట్, డీజిల్‌పై 27 శాతం విధిస్తుండటం వల్ల ఈ భారం మరింత పెరిగింది. ప్రస్తుత మార్కెట్ లెక్కల ప్రకారం ప్రధాన నగరాలైన హైదరాబాద్ లో పెట్రోల్ రూ.115.73, డీజిల్ రూ.103.82, వరంగల్ లో పెట్రోల్ రూ.115.13, డీజిల్ రూ.103.292. లకు అమ్ముతున్నారు.

**200 లీటర్ల ఆంక్షల ఎఫెక్ట్ ...బల్క్ దోపిడీకి బ్రేక్**

కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ బంకుల్లో బల్క్ కొనుగోళ్లపై 90 రోజుల పాటు తాత్కాలికంగా విధించిన 200 లీటర్ల రోజువారీ

మిగతా 3వ పేజీలో..




## తెలంగాణ భవిష్యత్తుకు
# విద్యే పునాది

- 60 ఏళ్ల పోరాట ఫలితమే తెలంగాణ రాష్ట్రం
- విద్యాశాఖకు రూ.26,600 కోట్ల కేటాయింపు
- డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి విద్యార్థుల ప్రతిజ్ఞ
- ఒలింపిక్స్ లక్ష్యంగా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు
- 119 యంగ్ ఇండియా పాఠశాలలతో విద్యలో విప్లవం

**హైదరాబాద్, జూన్ 19:**

తెలంగాణ రాష్ట్రం భాషా ప్రయుక్త రాష్ట్రంగా గానీ, పాలనా సౌలభ్యం కోసమో ఏర్పడలేదని, 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, త్యాగాలు, ఆత్మబలిదానాల ఫలితంగానే తెలంగాణ ఆవిర్భవించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గత పదేళ్లలో విద్యారంగాన్ని నిర్వీర్యం చేశారని విమర్శించిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యను వికాసం దిశగా తీసుకెళ్తున్నామని

మిగతా 2వ పేజీలో..

**కార్పొరేట్ కు పోటీగా ప్రభుత్వ స్కూళ్లు** 2

## ఓటు భద్రం.. 'మ్యాపింగ్' ముఖ్యం..!

- ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ఎన్నికల సంఘం శ్రీకారం
- దోషరహిత ఓటర్ల జాబితా రూపకల్పనే లక్ష్యం
- నకిలీ, దొంగ ఓట్ల తొలగింపునకు చర్యలు
- 2002 జాబితా ఆధారంగా సర్వే
- ఇంటింటికీ రానున్న బూత్ స్థాయి అధికారులు
- కుటుంబ సభ్యుల వివరాల అనుసంధానం తప్పనిసరి
- మ్యాపింగ్ చేసుకోకపోతే ఓటు పోయే ప్రమాదం
- మొబైల్ యాప్ ద్వారా సులభంగా నమోదు

2




## వర్షా కాలానికి ముందస్తు సన్నద్ధత

- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ఆకస్మిక తనిఖీ
- విద్యుత్ అంతరాయాల నివారణపై ప్రత్యేక దృష్టి
- బంజారాహిల్స్‌లో లైన్ల పరిశీలన, చెట్ల కొమ్మల కత్తిరింపు
- సామాన్యుడిలా లైన్‌మెన్‌లతో ముచ్చటించిన సీఎండీ జితేష్ వి. పాటిల్

3



## విద్యుత్ ఏఈ తీసుకున్నది
# లంచం కాదు..!

- మంచి వ్యక్తిని కావాలనే ఇరికించారు..
- ఏసీబీని ఆశ్రయించిన ఫిర్యాదు దారుడికి నేరచరిత్ర
- కాంట్రాక్టర్‌కు ఇవ్వాల్సిన డబ్బులు ఇచ్చి ఏఈపై కుట్ర
- సీనియర్ రాజకీయ నేత చెబితేనే డబ్బులు తీసుకున్న రామకృష్ణారెడ్డి
- సదరు సీనియర్ నేతను సైతం మోసం చేసిన ఫిర్యాదుదారుడు

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

సంగారెడ్డి జిల్లా బొల్లారం విద్యుత్ ఏఈ రామకృష్ణారెడ్డిపై జరిగిన ఏసీబీ దాడుల వ్యవహారంలో ఊహించని కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. స్థానికంగా ఒక కరెంట్ స్తంబాన్ని కూల్చేసిన వ్యక్తి, కాంట్రాక్టర్‌కు ఇవ్వాల్సిన పరిహారం డబ్బును ఏఈకి ఇచ్చి ఉద్దేశపూర్వకంగా ఇరికించినట్లు తెలుస్తోంది. 30 ఏళ్ల సుదీర్ఘ సర్వీసులో రామకృష్ణారెడ్డికి విద్యుత్ శాఖలో

మిగతా 2వ పేజీలో..



## భూ వివాదాలు లేని రాష్ట్రమే లక్ష్యం

- రాష్ట్రంలో దశల వారీగా భూముల రీసర్వే
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

3

## కేంద్రం నిర్ణయం మేరకే కొంటే మీరెందుకు ?

- కాంగ్రెస్‌ది రైతు వ్యతిరేక, విశ్వాస ఘాతుక ప్రభుత్వం
- రాహుల్ జన్మదినం రోజే రైతు డిక్లరేషన్‌కు చెల్లుచీటీ
- రైతులపై విషం కక్కిన సిఎం రేవంత్ రెడ్డి
- మీడియా సమావేశంలో ప్రభుత్వంపై హరీష్ రావు విమర్శలు

2



## హామీలను విస్మరించిన కాంగ్రెస్



- మాఫియా నాయకుడిగా రేవంత్ వ్యవహార శైలి
- కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పాలన సాగిస్తున్నారు
- మల్కాజిగిరి కార్యకర్తల సమావేశంలో కెటిఆర్ విమర్శలు

2



## చిన్నారుల ఆరోగ్యం, ఆనందమే అసలైన అభివృద్ధి

- మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- చాంద్రాయణగుట్టలో అంగన్‌వాడీ-కమ్-పాలన కేంద్రం ప్రారంభం

2



3

## అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు సమన్లు

- సోమవారం వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశం



3

## మైనర్ల డ్రైవింగ్‌ను క్షమించేది లేదు

- స్కూల్ పిల్ల భద్రత యాజమాన్యాలదే బాధ్యత
- యాజమాన్యాలతో భేటీలో సీపీ సజ్జనార్

## ఫేక్ ఐడీలతో యువతులకు టోకరా

- పెళ్లి పేరుతో రూ.12 లక్షలు, బంగారం కాజేసిన యువకుడు
- ఐపీఎస్, ఎంబీబీఎస్ విద్యార్థినంటూ నమ్మించిన కేటుగాడు

3





## మీనాక్షి నటరాజన్‌పై ప్రజాప్రతినిధుల కోర్టులో పిటిషన్

2

- ప్రతివాదుల జాబితాలో ఏడుగురు
- త్వరలో విచారణ చేపట్టనున్న న్యాయస్థానం



## సోలార్ రూఫ్ టాప్ టెండర్ల నిబంధనలు మార్చాలి

- కేటీఆర్‌కు టీఎస్ ఈఫ ప్రతినిధుల విజ్ఞప్తి

3

# కార్పొరేట్ కు పోటీగా ప్రభుత్వ స్కూళ్లు

- 27 లక్షల మంది విద్యార్థులకు విద్యా కిట్ల పంపిణీ
- రాష్ట్ర చరిత్రలో ఇదొక సువర్ణాధ్యాయం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**హైదరాబాద్, జూన్ 19 - సిరిన్యూస్ :**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేలా ప్రభుత్వం ఒక చరిత్రాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 27 లక్షల మంది విద్యార్థులకు నాణ్యమైన వస్తువులతో కూడిన విద్యా కిట్లను పంపిణీ చేసే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఇది కేవలం ఒక రోజువారీ ప్రభుత్వ కార్యక్రమం కాదని, దశాబ్దాలుగా ఉన్న విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు, విద్యార్థుల ఆత్మగౌరవానికి ప్రతీక అని డిప్యూటీ సీఎం అన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా కిట్లను ప్రజాప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. ఈ కిట్ లో అందించే బూట్లు, యూనిఫామ్, పుస్తకాలు, బెడ్ షీట్స్ వంటి ప్రతీ వస్తువును అత్యంత నాణ్యతతో రూపొందించినట్లు ప్రకటించారు. గత ప్రభుత్వాల మాదిరిగా మొక్కుబడిగా కాకుండా ప్రజాధనంలోని ప్రతి పైసాకు జవాబుదారీతనంగా ఈ వస్తువులను విద్యార్థులకు అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఒక తండ్రిలా బాధ్యత తీసుకొని ఈ కిట్లను అందిస్తున్నారన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అనే నినాదంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వం ఇస్తున్న యూనిఫామ్ కేవలం ఒక వస్త్రం ముక్క కాదు.. తాము ఇస్తున్న బూట్లు కేవలం కాళ్లకు వేసుకునేవి కావు.. అవి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సమాజంలో మేమెవరికీ తక్కువ కాదని ధైర్యంగా, సగర్వంగా తల ఎత్తుకుని తిరిగేలా చేసే ఆత్మగౌరవ ప్రతీకలుగా ఆయన అభివర్ణించారు.

**ప్రపంచంతో పోటీ పడేలా యంగ్ ఇండియా స్కూల్స్**

విద్యా బుద్ధులతోపాటు విద్యార్థుల ఆహార్యం, మౌలిక వసతులు కూడా అంతర్జాతీయ స్థాయిలో ఉండాలన్నదే ప్రజా ప్రభుత్వ సంకల్పమని, ఇందులో భాగంగానే ఒక్కొక్క ఇంటిగ్రేటెడ్ పాఠశాలను రూ.200 కోట్ల భారీ వ్యయంతో ప్రపంచ □థయి వసతులతో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఒకేసారి వంద యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను మంజూరు చేసిందని భట్టి చెప్పారు. ఇటీవలే ఆరుట్ల గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ప్రారంభమైన తెలంగాణ పబ్లిక్ స్కూల్ దీనికి సజీవ సాక్ష్యం. అక్కడ నిర్మించిన అత్యాధునిక కిచెన్ ఏ కార్పొరేట్ స్కూల్లోనూ లేని విధంగా ఉందన్నారు. భవిష్యత్తులో ని ప్రభుత్వ పాఠశాలలన్నీ ఇదే రీతిన మారబోతున్నాయని చెప్పారు.

**విపక్షాలపై ఘాటు విమర్శలు**

రాష్ట్రంలో పేద, బలహీనవర్గాల పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున సంస్కరణలు చేపడుతుంటే ప్రతిపక్ష నాయకులు అవాకులు చవాకులు పేలడంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. అభివృద్ధి చెందుతున్న తెలంగాణను చూసి, ప్రపంచంతో పోటీపడుతున్న విద్యార్థులను చూసి అభినందించాల్సింది పోయి విమర్శలు చేయడం వారి సంకుచిత మనస్తత్వానికి నిదర్శనమని అన్నారు.

**నిరంతరాయంగా విద్యా యజ్ఞం**

ఈ విద్యా కిట్ల పంపిణీ కార్యక్రమం ఇందిరమ్మ ప్రభుత్వానికి అత్యంత ప్రియమైనదని, ఇది నిరంతరాయంగా కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ చరిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, తెలంగాణ సమాజానికి భట్టి విక్రమార్క ధన్యవాదాలు తెలిపారు.

# ఓటు భద్రం.. 'మ్యాపింగ్' ముఖ్యం..!

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

భారత ఎన్నికల సంఘం అత్యంత ప్రతిష్టాత్మకంగా, పారదర్శకంగా ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ఎంతో విలువైనదైనందున, ఎలాంటి తప్పులు లేని పక్కా ఓటర్ల జాబితాను తయారు చేయడమే ఈ బృహత్తర కార్యక్రమం యొక్క ముఖ్య లక్ష్యంగా ఉంది. ఒకే వ్యక్తి పేరు రెండుసార్లు రావడం, తప్పుడు పేర్లు లేదా నకిలీ చిరునామాలను ఓటర్ల లిస్ట్ నుండి పూర్తిగా తొలగించడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా ఈ మొత్తం వ్యవస్థ పనిచేస్తోంది.

**కుటుంబ ఓట్ల అనుసంధానం**

ఈ సమగ్ర ప్రక్షాళన ప్రక్రియలో 'మ్యాపింగ్' అత్యంత కీలకమైనదిగా అధికారులు పేర్కొంటున్నారు. ఒకే కుటుంబంలోని సభ్యులు అనగా కన్నతల్లిదండ్రులు, భార్యాభర్తలు, పిల్లలు అందరూ ఒకరితో ఒకరు సంబంధం కలిగి ఉండేలా ఓటరు జాబితా రూపకల్పన జరుగుతోంది. ఈ నెల జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఈ లోగా మ్యాపింగ్ పూర్తి చేసుకోకపోతే ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని, ఒకసారి ఓటు గల్లంతయితే తర్వాత మార్పులు చేసుకోవడం చాలా కష్టమని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే మనుగూరు వంటి ప్రాంతాల్లో బూత్ లెవెల్ అధికారులకు, యాడ్ ప్రొటెక్షన్ సెల్ ప్రతినిధులకు దీనిపై ప్రత్యేక శిక్షణ కూడా పూర్తి చేయడం జరిగింది.

**సర్వేలో మూడు రకాల పద్ధతులు**

ఈ ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను ప్రధానంగా రెండు వేల రెండు నాటి పాత ఓటరు జాబితాను బేస్ చేసుకుని మూడు పద్ధతుల్లో నిర్వహిస్తున్నారు. మొదటి పద్ధతి ప్రకారం రెండు వేల రెండు సర్వే ఓటరు లిస్టులో పేరు ఉండి, ప్రస్తుతం కూడా పేరు ఉన్నవారు బూత్ స్థాయి అధికారుల దగ్గరకు వెళ్లి నేరుగా సెల్ఫ్ మ్యాపింగ్ చేయించుకోవాల్సి ఉంటుంది. రెండో పద్ధతి కింద రెండు వేల రెండు సమయానికి ఓటు హక్కు వయస్సు రాకపోయినా, ప్రస్తుతం ఓటరు లిస్టులో పేరు ఉన్నవారు తమ తల్లిదండ్రులు, సోదరులు లేదా కుటుంబ సభ్యుల పేర్లతో అనుసంధానం చేసుకుని మ్యాపింగ్ చేసుకోవాలి. ఇక మూడో పద్ధతిలో రెండు వేల రెండు నాటికి పద్దెనిమిది సంవత్సరాలు నిండి ఉన్నా ఆ జాబితాలో పేరు లేకపోతే, ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితాలోని వివరాల ఆధారంగా స్వీయ నిర్ధారణ ద్వారా మ్యాపింగ్ చేసుకోవాల్సి ఉంటుంది.

**ఆధారాల సమర్పణ..పాత జాబితా లభ్యత**

మ్యాపింగ్ ప్రక్రియ సజావుగా సాగడానికి రెండు వేల రెండు ఓటరు లిస్టులోని బూత్ నెంబర్, తల్లిదండ్రుల ఓటు సీరియల్ నెంబర్ లేదా ఓటర్ ఐడీ నెంబర్ సమర్పించాల్సి ఉంటుంది. ఈ పాత రెండు వేల రెండు ఓటరు జాబితా తహసీల్దార్ కార్యాలయం లేదా బూత్ స్థాయి అధికారుల వద్ద అందుబాటులో ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ దొంగ ఓట్లు, చనిపోయిన వారి వివరాలు ఇందులో మ్యాప్ కాకుండా నిరోధించడానికి ఈ నిబంధన పెట్టారు.

**దొంగ ఓట్ల ఏరివేత.. ప్రజాధనానికి రక్షణ**

ఎన్నికల కమీషన్ నోటిఫికేషన్ విడుదల చేసినప్పటి నుండి ప్రక్రియ ముగిసేలోపు ఒక్కో ఓటరుపై సుమారు వెయ్యి నాలుగు వందల రూపాయల పైనే ఖర్చు చేస్తుంది. అయితే ప్రస్తుత ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి ఓట్లు, ఒకే వ్యక్తికి రెండు మూడు చోట్ల ఉన్న దొంగ ఓట్లు, అక్రమ వలసదారుల ఓట్లు కూడా ఉన్నాయి. వారు ఓటు వేసినా వేయకపోయినా ప్రభుత్వం ప్రతి ఓటుపై ప్రజాధనాన్ని ఖర్చు చేయాల్సి వస్తోంది కాబట్టి ఈ ప్రత్యేక ప్రక్రియ ద్వారా ఓటు ప్రక్షాళన అత్యంత ఆవశ్యకమైంది. దీనివల్ల నకిలీ ఓట్లు పూర్తిగా తొలగిపోతాయి.

**వినియోగించాల్సిన ఫారాల వివరాలు**

ఈ సవరణ ప్రక్రియ సమయంలో ఓటర్లు తమ అవసరాలకు తగినట్లుగా వివిధ ఫారాలను ఉపయోగించాల్సి ఉంటుంది. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఆరో నెంబర్ ఫారం, ఓటర్ల జాబితా నుంచి పేరును తొలగించడానికి ఏడో నెంబర్ ఫారం, పేరు, వయస్సు, చిరునామా తప్పులను సరిదిద్దుకోవడానికి లేదా నియోజకవర్గ మార్పు కోసం ఎనిమిదో నెంబర్ ఫారం ఉపయోగించాల్సి ఉంటుంది.

**సులభతరమైన డిజిటల్ వేదికలు**

ప్రజలు బూత్ స్థాయి అధికారుల కోసం ఎదురుచూడకుండా మొబైల్ యాప్ లేదా జాతీయ ఓటర్ల సేవా పోర్టల్ ద్వారా డిజిటల్ పద్ధతిలో కూడా సరిచూసుకోవచ్చు.

# తెలంగాణ భవిష్యత్తుకు విద్యే పునాది: సీఎం రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి






స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో కలిసి యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్లను విద్యార్థులకు పంపిణీ చేసిన అనంతరం నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ శాఖల స్టాళ్లను పరిశీలించిన ఆయన, మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

రాష్ట్ర బడ్జెట్‌లో 8.5 శాతం నిధులు అంటే రూ.26,600 కోట్లను విద్యాశాఖకు కేటాయించినట్లు సీఎం వెల్లడించారు. గత పాలనలో విద్యారంగానికి వందేళ్ల నష్టం జరిగిందని విమర్శించారు. విద్యార్థుల డైట్ ఛార్జీలను పదేళ్లుగా, ఇతర భత్యాలను పదహారేళ్లుగా పెంచలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని పెంచినట్లు తెలిపారు. విద్యారంగ ప్రక్షాళన కోసం విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నానని చెప్పారు.

విద్యార్థుల తలరాతను మార్చేది తరగతి గదులేనని పేర్కొన్న సీఎం, తెలంగాణ యువత దేశానికే ఆదర్శంగా నిలవాలంటే విద్యను ఇష్టపడి అభ్యసించాలని సూచించారు. ప్రభుత్వ విద్యే దేశాభివృద్ధికి బలమైన పునాది కావాలని, అందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని హామీ ఇచ్చారు.

దేశ జనాభా 140 కోట్లకు పైగా ఉన్నప్పటికీ ఒలింపిక్స్‌లో ఆశించిన స్థాయిలో స్వర్ణ పతకాలు సాధించలేకపోవడం పాలకుల వైఫల్యమని వ్యాఖ్యానించారు. అందుకే తెలంగాణలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకాలు సాధించే క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యమన్నారు.

కృత్రిమ మేధ ప్రభావంతో వైట్ కాలర్ ఉద్యోగాల్లో మార్పులు వస్తున్నాయని, నైపుణ్యాలు ఉన్న వారికి మాత్రం అవకాశాలు విస్తృతంగా ఉంటాయని చెప్పారు. ఈ నేపథ్యంలో యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

రాష్ట్రవ్యాప్తంగా 119 యంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నామని సీఎం తెలిపారు. కార్పొరేట్ స్థాయి విద్యను ప్రభుత్వ రంగంలో అందించడమే లక్ష్యమని చెప్పారు.

ఇటీవల ప్రారంభించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో అన్ని సీట్లు నిండిపోయాయని గుర్తు చేశారు. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల కోసం పరిమితులు విధించే స్థాయికి విద్యా వ్యవస్థను తీసుకెళ్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఉన్నతాధికారులుగా ఎదగాలని, తెలంగాణను దేశంలోనే విద్యా కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థులకు అవసరమైన ప్రతి సహాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు.

# హామీలను విస్మరించిన కాంగ్రెస్

**హైదరాబాద్,జూన్ 19:**

రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్పి, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది రోజుల్లోనే ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, ప్రభుత్వాన్ని ఒక మాఫియాతో పోల్చారు. ప్రభుత్వం ఏర్పడి ఇన్ని రోజులవుతున్నా ఇచ్చిన గ్యారంటీల ఊసే లేదు. ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తే అడ్డమైన తిట్లు తిడుతున్నారన్నారు. కేసీఆర్‌ను తిట్టుకుంటూ తిరిగితే చాలు పాలన చేయనక్కర్లేదు అనే చందాన సీఎం వ్యవహార శైలి ఉందని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన పనులకు రిబ్బన్లు కట్ చేయడానికి సీఎం తన జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి శూన్యమైందని, కేవలం అప్పులే పెరిగిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. ఈ కొద్ది కాలంలోనే ప్రభుత్వం దాదాపు 4 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో పేదలకు ఒక్క ఇల్లు కూడా కట్టి ఇవ్వలేదు గాని, 'హైడ్రా' పేరుతో ఉన్న ఇళ్లను మాత్రం నిర్దాక్షిణ్యంగా కూల్చుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులను 'దండుపాళ్యం ముఠా'తో పోల్చిన ఆయన, ఈ ప్రభుత్వాన్ని ఒక మాఫియా నడుపుతోందని, ఆ మాఫియాలో రేవంత్ రెడ్డి ఒక పిల్ల నాయకుడు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం దగ్గర గోనెసంచులు కూడా లేవని, ఆ సంచులన్నీ దిల్లీకి పోతున్నాయని విమర్శించారు. రైతులకు ఇవ్వాల్సిన 'రైతుబంధు' డబ్బు బంద్ అయిపోయిందని, ఆ పైసలన్నీ రాహుల్ గాంధీ ఖాతాలో 'టింగ్ టింగ్' అని పడుతున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, రైతులు ధాన్యం కుప్పలపైనే ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు మంచి, చెడు ఏంటో పూర్తిగా అర్థమైందన్న కేటీఆర్, కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలంతా కథానాయకులు కావాలని పిలుపునిచ్చారు. మల్కాజ్‌గిరి ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఎటువంటి రౌడీలు, గుండాలకు భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పరంగా నిలబడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.




## మీనాక్షి నటరాజన్‌పై ప్రజాప్రతినిధుల కోర్టులో పిటిషన్

**హైదరాబాద్, జూన్ 19:**

తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్‌పై ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టులో ప్రైవేట్ ఫిర్యాదు పిటిషన్ దాఖలైంది. నారాయణపేట జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత కంభం శివకుమార్ రెడ్డి తనను వేధించడంతో పాటు ప్రాణహాని బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ శ్రీలత అనే మహిళ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు.

గతంలో ఇదే అంశంపై నాంపల్లి కోర్టును ఆశ్రయించిన శ్రీలత పిటిషన్‌ను ఆ కోర్టు విచారించింది. అయితే ఈ కేసు తమ పరిధిలోకి రాదని పేర్కొంటూ పిటిషన్‌ను తిరిగి ఇచ్చేసింది. సంబంధిత అంశాన్ని ప్రజాప్రతినిధుల కోర్టులో దాఖలు చేయాలని సూచించింది.

దీంతో తాజాగా శ్రీలత ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌లో మీనాక్షి నటరాజన్‌తో పాటు మరో ఏడుగురిని ప్రతివాదులుగా చేర్చారు.కంభం శివకుమార్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పార్టీ అధిష్ఠానం స్పందించలేదని పిటిషన్‌లో పేర్కొన్నట్లు సమాచారం. ఈ వ్యవహారానికి సంబంధించిన ఆరోపణలపై ప్రజాప్రతినిధుల కోర్టు త్వరలో విచారణ చేపట్టనుంది. పిటిషన్‌పై న్యాయస్థానం ఎలాంటి ఆదేశాలు జారీ చేస్తుందన్న అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# చిన్నారుల ఆరోగ్యం, ఆనందమే అసలైన అభివృద్ధి

**హైదరాబాద్, జూన్ 19 - సిరిన్యూస్:**

చాంద్రాయణగుట్ట నియోజకవర్గ పరిధిలోని అరుంధతి నగర్‌లో అంగన్‌వాడీ కేంద్రం కమ్‌పాలన(డే కేర్) కేంద్రాన్ని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు యూనిఫాంలు పంపిణీ చేసి వారి అభ్యాస ప్రదర్శనలను వీక్షించి అభినందించారు. అనంతరం లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బోయ నగేష్, చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో తొలి పాలన కేంద్రాన్ని చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆరు నెలల నుంచి మూడేళ్ల వయస్సు గల చిన్నారులకు సంరక్షణ, పోషకాహారం, ఆటల ద్వారా అభ్యాసం అందించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం, పాలన కేంద్రాన్ని ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేయడం ద్వారా ఒకే కుటుంబంలోని చిన్నారులకు సమగ్ర సేవలందేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఉపాధి కోసం బయటకు వెళ్లే తల్లులకు ఈ డే కేర్ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని, పిల్లల సంరక్షణ కోసం మహిళలు తమ ఉద్యోగాలు, ఉపాధిని వదులుకోవాల్సిన పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని అన్నారు. చిన్నారి జీవితంలోని మొదటి వెయ్యి రోజులు అత్యంత కీలకమైనవని, ఆ దశలో మెదడు ఎదుగుదలతోపాటు శారీరక, మానసిక వికాసం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. అందుకే గర్భధారణ దశ నుంచి తొలి రెండేళ్ల వరకు తల్లులు, చిన్నారులకు అవసరమైన పోషకాహారం, ఆరోగ్య సేవలు, సంరక్షణ అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ప్రైవేట్ నర్సరీలకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దుతూ 57 రకాల ఆట వస్తువులు, యూనిఫాంలు, నాణ్యమైన ప్రీస్కూల్ విద్యను అందిస్తున్నామని చెప్పారు. ఆరేళ్లలోపు పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందంటూ పట్టణ ప్రాంతాల్లో కూడా మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, టీనేజ్ బాలికల కోసం ప్రత్యేక మహిళా సంఘాలను



ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పేదరిక నిర్మూలనతోపాటు నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అమ్మకు అక్షర మాల కార్యక్రమం ద్వారా ఇప్పటికే ఆరు లక్షల మంది మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దామని మంత్రి సీతక్క చెప్పారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అనితా రామచంద్రన్, బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బోయ నగేష్, ఎస్బీఐ ఫౌండేషన్ ప్రతినిధులు, అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యూష్ మెహ్రోత్రా అధ్యక్షుడు, ఎస్‌బీఐ ఫౌండేషన్ రాజారాం చవాన్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్, ఎస్‌బీఐ ఫౌండేషన్ రుద్రాణి గుహ, అసిస్టెంట్ మేనేజర్ (శిశు అభివృద్ధి) పాల్గొన్నారు.

# కేంద్రం నిర్ణయం మేరకే కొంటే మీరెందుకు ?

**సిద్దిపేట, జూన్ 19 - సిరిన్యూస్:**

కేంద్రం కనీస మద్దతు ధర నిర్ణయించిన పంటలను మాత్రమే కొంటామంటే ఇక మీరెందుకని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలను బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు సూటిగా ప్రశ్నించారు. పేపర్ లెస్ కేబినెట్ అన్నారని.. కానీ మీది విశ్వాసం లేని కేబినెట్, విశ్వాసఘాతుక ప్రభుత్వమని రేవంత్ రెడ్డి సర్కారుపై నిప్పులు చెరిగారు. పంట కొనుగోలుపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసిందని ఎద్దేవా చేశారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ వరంగల్‌లో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటించారని గుర్తు చేశారు. ఆయన జన్మదినం రోజే ఆ డిక్లరేషన్‌ను సీఎం బొందపెట్టారని విమర్శించారు. ధాన్యం ఏదైనా కనీస మద్దతు ధరతోపాటు బోనస్ కూడా ఇస్తామని నాడు రాహుల్ గాంధీ వరంగల్ వేదికగా ప్రకటించారని గుర్తు చేశారు. కానీ అందుకు భిన్నంగా కేంద్రం చెప్పిందే కొంటాం.. ఎంత కొనమంటే అంతే కొంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారని తెలిపారు. తన బాధ్యత నుంచి తప్పించుకుంటుందంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం కొన్నా కొనకపోయినా అన్ని పంటలు కొన్నది కేసీఆర్ ప్రభుత్వమని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తన నిర్ణయం మార్చుకోవాలని ప్రభుత్వాన్ని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కేంద్రం ఎంఎస్‌పి ప్రకటిస్తుంది తప్ప మక్కలూ, జొన్నలు కొనదా అని అసహనం వ్యక్తం చేశారు. పప్పు దినుసులు, వేరుశనగ 25 శాతం మాత్రమే కేంద్రం కొనుగోలు చేస్తుందన్నారు. అంటే మిగతా పంటను రైతులు బయట అమ్ముకోవాలా అని నిలదీశారు. దళారుల దయాదక్షిణ్యంపై రైతులు ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొందని హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేంద్రం కొంటుందని, మిగతా పంటను రైతులు ఏం చేయాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలంటున్న రైతులకు ప్రభుత్వం భరోసా ఇస్తుందా అని అడిగారు. తడి గుడ్డతో రైతుల గొంతును రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోస్తుందన్నారు. రైతులు జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటం ఆడుతున్నాయన్నారు. ఎకరాకు రెండు బస్తాల యూరియా మాత్రమే.. అదీ నెలకు ఒకటి చొప్పున ఇస్తారట అంటూ ఆయన ఆందోళన చెందారు. రైతులంటే ఎందుకు ఇంత చిన్నచూపు అని మంత్రులను ఆయన ప్రశ్నించారు. యూరియా ఇచ్చే తెలివి కూడా లేదా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. మిర్చి రైతులు ఎకరాకు ఐదారు యూరియా బస్తాలు వాడతారని, మరి మీరు రెండే ఇస్తే మిగతాది ఎట్లా అని ప్రశ్నించారు. కేంద్రం 30 శాతం యూరియా ధరలు పెంచిందని వివరించారు. రెండు బస్తాల ఆలోచన విరమించుకోవాలని ప్రభుత్వానికి హితవు పలికారు. 45 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు బంధు ఇస్తామన్నారని, 90 రోజులు అయ్యిందని, ఇప్పటికీ రైతుల ఖాతాల్లో నగదు మొత్తం పడలేదని విమర్శించారు. ఎకరాకు రూ.15 వేలు అన్నారని చెప్పారు. 202425 వానాకాలం పంటకు ఒక్క రూపాయి ఇవ్వలేదని.. పూర్తిగా ఎగ్గొట్టారని తెలిపారు. రైతుబంధు కింద కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం 5 పంటలకు రైతులకు రూ.29,358 కోట్లు బకాయి పడ్డిందని అన్నారు. రైతు బీమా ఆగలేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల చెప్పారని గుర్తు చేశారు. మరి ఈ ఏడాది జనవరి నుంచి నేటి వరకు రైతు బీమా ఆగిందా? లేదా చెప్పాలని మంత్రులను ఆయన ప్రశ్నించారు. దీనిపై చర్చకు ఏ ఊరుకైనా పోదాం వస్తారా అని మంత్రులకు సవాల్ విసిరారు. రాష్ట్రంలో 7,600 మందికి బీమా రాలేదని గణాంకాలతో హరీష్ రావు వివరించారు. ఎందుకు బీమా రావడం లేదంటే ప్రభుత్వం ప్రీమియం కట్టలేదన్నారని చెప్పారు. గురువారం మీరు కేబినెట్‌లో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని పంటలు యథావిధిగా కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి స్పష్టం చేశారు. తప్పుడు నిర్ణయం తీసుకున్నందుకు రైతులకు క్షమాపణ చెప్పాలని రేవంత్ సర్కార్‌ను హరీష్ రావు డిమాండ్ చేశారు.

# తెలంగాణలో ఇంధన సెగ !

**మొదటిపేజీ తరువాయి**

పరిమితి తెలంగాణపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వాస్తవానికి ఇండస్ట్రియల్ విని యోగానికి వాడే బల్క్ డీజిల్ ధర లీటరుకు రూ.134.50 ఉండగా, రీటైల్ బంకుల్లో రూ. 95రూ.103 మధ్య ఉంది. ఈ భారీ వ్యత్యాసాన్ని ఆసరాగా చేసుకుని టెలికాం టవర్ ఆపరేటర్లు, భారీ పరిశ్రమలు రీటైల్ బంకుల నుంచి పెద్ద మొత్తంలో డీజిల్ కొనుగోలు చేస్తుండటంతో, సాధారణ వినియోగదారులకు కొరత ఏర్ప డకుండా కేంద్రం ఈ 200 లీటర్ల నిబంధన తెచ్చింది. అయితే హైదరాబాద్ మీదుగా సుదూర ప్రాంతాలకు వెళ్లే నేషనల్ హైవే ట్రక్కు లు ఒకే బంకులో ట్యాంక్ ఫుల్ (సాధారణంగా 300400 లీటర్లు) చేసుకునే అవకాశం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**తెలంగాణ రైతాంగంపై 'డీజిల్' దెబ్బ...**

రాష్ట్రంలో ప్రస్తుత ఖరీఫ్ సాగు సీజన్ ప్రారం భమవుతున్న తరుణంలో డీజిల్ ధరల పెంపు రైతులకు పెద్ద శాపంగా మారింది. ట్రాక్టర్ల ద్వారా పొలాలు దున్నడానికి, నీటి పంపుసెట్ల నిర్వహణకు, అలాగే పండించిన ధాన్యాన్ని మార్కెట్లకు తరలించే రవాణా ఖర్చులు విపరీ తంగా పెరిగిపోయాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇంధన ధరలను నియంత్రించకపోవడం వల్ల సాగు వ్యయం భారమై రైతులు నష్టపోతున్నారని విమ ర్శిస్తున్నారు. ధరల పెరుగుదలపై తెలంగాణలో రాజకీయ సెగలు రేగుతున్నాయి. మాజీ ఆర్థిక మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీష్ రావు ము ఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల ముందు ఇంధన ధరలు తగ్గిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేస్తూ, ప్రజలపై భారం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెట్రోల్, డీజిల్‌లపై వ్యాట్ శాతాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు.

**పౌరసరఫరాల శాఖ క్లారిటీ..**

ఇంధన ధరలు, కొనుగోలు ఆంక్షల వార్తల నేప థ్యంలో గతంలో హైదరాబాద్‌లోని శేరిలింగంప ల్లి, కూకట్‌పల్లి, అమీర్‌పేట్ వంటి ప్రాంతాల్లోని బంకుల్లో వాహనదారులు క్యూ కట్టడం, కొన్ని చోట్ల 'నో స్టాక్' బోర్డులు కనిపించడం కలకలం రేపింది. దీనిపై తెలంగాణ పౌరసరఫరాల శాఖ స్పందిస్తూ.. రాష్ట్రంలో ఇంధన కొరత లేదని, సరిపడా నిల్వలు ఉన్నాయని స్పష్టం చేసింది. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ లేదా మహారాష్ట్ర



సరిహద్దు జిల్లాల నుంచి వస్తున్న ఒత్తిడి వల్లే కొన్ని బంకుల్లో తాత్కాలికంగా స్టాక్ అయిపోతోందని అధికారులు సూచించారు. ఇలావుండగా లారీ అసోసియేషన్లు బంకుల్లో రోజువారీ 200 లీటర్ల పరిమితిని కమర్షియల్ వాహనాలకు మిన హాయించాలని కోరుతున్నాయి. డీజిల్ ధరల పెంపు వల్ల హైదరాబాద్ హోటళ్లలో ఫుడ్ రేట్లతో పాటు మార్కెట్లో కూరగాయల ధరలు 15 శాతం పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయి ల్ ధరలు కొంత తగ్గుముఖం పట్టినా.. రవాణా వ్యవస్థ సాధారణ స్థితికి వచ్చే వరకు దేశీయంగా ఇంధన ధరల తగ్గింపు తక్షణమే సాధ్యం కాదని కేంద్ర చమురు శాఖ సహాయ మంత్రి సురేష్‌గోపి స్పష్టం చేశారు.

# నాలెడ్జ్ సిటీ భూముల వివాదం..

- **ఎస్‌బీఐపై ప్రభుత్వం ఆగ్రహం**
- **హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిన బ్యాంకు***

**హైదరాబాద్, జూన్ 19 - సిరిన్యూస్:**

రాయదుర్గం నాలెడ్జ్ సిటీ పరిధిలోని 5.09 ఎకరాల ప్రభుత్వ భూముల వేలం వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. ఈ భూమిపై తమకూ హక్కు ఉందంటూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించడం తో ప్రభుత్వం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. 2010లో రూ.13.33 కోట్లకు ఈ భూమిని కొనుగోలు చేశామని, ఇటీవల ప్రభు త్వం వేలం వేసిన భూమిలో కొంతభాగం తమ పరిధిలోనిదేనని పేర్కొంటూ ఎస్‌బీఐ హైకోర్టు లో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌తో ఇప్పటికే దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన నాలెడ్జ్ సిటీ భూముల వేలం వివాదాస్పదంగా మారింది.గత మే 28న సర్వే నంబర్ 83/1లోని ప్రభుత్వ భూములను తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ వేలం వేయగా, గౌరా వెంచర్స్ ఎకరానికి రూ.237 కోట్ల చొప్పున అత్యధిక ధరకు భూమిని సొంతం చేసుకుంది. ఈ వేలం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిం ది.అయితే వేలం పూర్తయిన తర్వాత భూమిపై హక్కులు ఉన్నాయని ఎస్‌బీఐ కోర్టును ఆశ్ర యించడం ప్రభుత్వానికి షాక్ ఇచ్చినట్లైంది. ఈ వ్యవహారంలో భూముల వేలానికి సంబంధిం చిన నిబంధనలను ఎస్‌బీఐనే ఉల్లంఘించిందని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.ఈ వివాదం నేపథ్యంలో ప్రభుత్వానికి, ఎస్‌బీఐకి మధ్య ఉన్న ఆర్థిక సంబంధాలపై సమీక్ష చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎస్‌బీఐలో ఉన్న ప్రభుత్వ డిపాజి ట్లు, వివిధ శాఖల ఖాతాల వివరాలను సేకరిస్తున్న ట్లు సమాచారం. అవసరమైతే ప్రభుత్వ ఖాతాలను ఇతర బ్యాంకులకు బదిలీ చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు అధికార వర్గాల్లో చర్చ జరుగు తోంది. భూముల యాజమాన్యంపై తుది నిర్ణయం హైకోర్టు విచారణ అనంతరం వెలువడనుండగా, ఈ వివాదం ప్రభుత్వంఎస్‌బీఐ మధ్య కొత్త ఉద్రిక్తత లకు దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# సోలార్ రూఫ్ టాప్ టెండర్ల నిబంధనలు మార్చాలి

**హైదరాబాద్, జూన్ 19 - సిరిన్యూస్:**

రాష్ట్రంలోని సుమారు పది వేల ప్రభుత్వ పాఠశాలల్లో 2 కిలోవాట్, 3 కిలోవాట్, 5 కిలోవాట్ రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థల ఏర్పాటు కోసం ఇటీవల విడుదల చేసిన టెండర్‌లో కనీస వార్షిక టర్నోవర్ ₹150 కోట్లు ఉండాలి, అలాగే ఒకే సంవత్సరంలో 25 మెగావాట్ల రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టులను అమలు చేసిన అనుభవం ఉండాలి అనే అర్హత ప్రమాణాలు విధించారు.. ఈ నిబంధనల కారణంగా ఎన్నో సంవత్సరాలుగా విజయ వంతంగా రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టులను అమలు చేస్తున్న స్థానిక సోలార్ ఎంఎస్ ఎంఈలు దాదాపు పూర్తిగా అనర్హులుగా మారుతున్నారని సోలార్ ఎనర్జీ అసోసియే షన్ (టీఎస్ ఈఏ) ప్రతినిధులు పేర్కొన్నారు. ఈమేరకు వారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను శుక్రవారం కలిసి తమ సమస్యను విన్నవించారు. గత దశాబ్ద కాలంలో రాష్ట్రంలో వార్షిక రూఫ్‌టాప్ సోలార్ ఇన్‌స్టాలేషన్లు చాలా సందర్భాల్లో 20 మెగావాట్లను కూడా మించలేదు. అలాంటి పరిస్థితిలో ఈ టెండర్ నిబంధనలు కొద్దిమంది పెద్ద సంస్థలకు, ముఖ్యంగా రాష్ట్రానికి వెలుపల ఉన్న కంపెనీ లకు మాత్రమే అనుకూలంగా రూపొందించి నట్లు కనిపిస్తున్నాయి. దీంతో తెలంగాణ పారి శ్రామికవేత్తలు తమ సొంత రాష్ట్రంలో అమలు అవుతున్న ప్రాజెక్టుల్లో పాల్గొనే అవకాశాన్ని కోల్పోతున్నారు. ఇంతకుముందు విడుదలైన పాఠశాల సోలార్ టెండర్ కూడా రాష్ట్రానికి వెలుపల ఉన్న కంపెనీలకే కేటాయించబడిం ది. అయితే సంవత్సరం గడిచినప్పటికీ ఆ ప్రా జెక్టు అమలులో ఆశించిన స్థాయిలో పురోగతి సాధించలేదని సమాచారం. స్థానిక పరిశ్రమ సామర్థ్యాలను వినియోగిస్తూ భాగస్వామ్యాన్ని విస్తరించాల్సిన అవసరం ఉన్న సమయంలో, కొత్త టెండర్ మరింత కఠినమైన అర్హత ప్రమాణాలతో స్థానిక సంస్థలకు అడ్డంకులు సృష్టిస్తోందని వివరించారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి సానుకూల స్పందన లభించలేదు. అందువల్ల నాణ్యత ప్రమాణాలను కాపాడుతూ తెలంగాణకు చెందిన సోలార్ సంస్థలు కూడా పోటీ పడగలిగే విధంగా టెండర్ అర్హత ప్రమా ణాలను హేతుబద్ధంగా సవరించాలని వారు కేటీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. నిజానికి బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రతిష్టాత్మక మన ఊరు - మన బడి కార్యక్రమం అమలులో భాగంగా తెలంగా ణకు చెందిన సోలార్ పారిశ్రామికవేత్తలకు పాఠశాలలలో సోలార్ ప్రాజెక్టుల అమలులో సమాన అవకాశాలు కల్పించబడ్డాయని వారు గుర్తుచేశారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో బుర్ర అశోక్ కుమార్ గౌడ్అ, ధ్యక్షుడు తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ (టీఎస్ ఈఏ) ,శ్రీహరిబాబు జనరల్ సెక్రటరీ , బాబు నాయుడుజాయింట్ సెక్రటరీ, శ్రీని వాస్ కుక్కడపు జాయింట్ సెక్రటరీ, రాజేష్ పరకాలవైస్ ప్రెసిడెంట్, ఈసీ మెంబర్లు బదరి నారాయణ, జాన్ విల్యం, రాగి తదితరులు

# విద్యుత్ ఏఈ తీసుకున్నది లంచం కాదు..!

**మొదటిపేజీ తరువాయి**

నిజాయితీపరుడైన అధికారిగా మంచి పేరుంది. ఆయన ఎక్కడ పనిచేసినా వినియోగదారులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించారని శాఖ వర్గాలు చెబుతున్నాయి. అవినీతి ఆరోప ణలు తరచుగా వినిపించే విద్యుత్ శాఖలో, ఇలాంటి మచ్చలేని ఒక సీనియర్ అధికారి ఒక నేర చరిత్ర కలిగిన వ్యక్తి పన్నిన పక్కా ప్రణాళిక కు బలికావడం స్థానికంగా తీవ్ర చర్చనీయాం శమైంది.

**అసలేం జరిగిందంటే..**

బొల్లారం సెక్షన్ పరిధిలో రెండు రోజుల క్రితం ప్రమాదవశాత్తు ఒక విద్యుత్ స్తంభం కూలిపో యింది. దీనికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు సిద్ధమ య్యారు. అయితే, సదరు వ్యక్తి స్థానిక రాజకీయ నాయకులను ఆశ్రయించడంతో వ్యవహారం పంచాయతీకి చేరింది. స్తంభం వేసిన కాంట్రా క్టర్‌కు నష్టపరిహారంగా రూ. 25 వేలు చెల్లించే లా పెద్ద మనుషులు ఒప్పందం చేశారు. దీనికి అంగీకరించిన సదరు వ్యక్తి (ఫిర్యాదుదారుడు), మరుసటి రోజు ఒక కుట్ర పన్నాడు. నేరుగా ఏఈకి ఫోన్ చేసి, 'కాంట్రాక్టర్‌కు ఇవ్వాల్సిన డబ్బులు మీకే ఇస్తాను, మీరే అతనికి ఇవ్వండి' అని నమ్మబలికాడు. పని జరిగినందుకు ఇవ్వా ల్సిన డబ్బులే కదా అని ఏఈ రామకృష్ణారెడ్డి ఒప్పుకున్నారు. కానీ, అప్పటికే ఒక హత్య కేసులో నిందితుడిగా ఉన్న సదరు ఫిర్యాదుదా రుడు.. ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చి ప్రాచుర్యం పొందాలనే దురుద్దేశంతో పక్కా ప్లాన్ ప్రకారం డబ్బులు ఇచ్చి పట్టించాడని సమాచారం.

**పెద్ద మనిషినే మోసం చేసిన ఫిర్యాదుదారుడు..**

ఏఈ రామకృష్ణారెడ్డి ఏసీబీకి చిక్కడానికి ముందు మరో కీలక పరిణామం చోటుచేసుకుం ది. బొల్లారం రాజకీయాలను శాసించే, ప్రజల మనిషిగా పేరున్న ఒక సీనియర్ రాజకీయ నేత ఏఈకి స్వయంగా ఫోన్ చేశారు. 'మీ దగ్గరకు వస్తున్న వ్యక్తి పేదవాడు.. జరిగిన నష్టానికి కాం ట్రాక్టర్‌కు ఇవ్వాల్సిన డబ్బులు మీకే ఇస్తాడు, మీరు తీసుకుని ఆ కాంట్రాక్టర్‌కు ఇవ్వండి' అని ఫిర్యాదుదారున్ని మంచివానిగా భావించి సూచించారట. స్థానికంగా మంచి ప్రజానాయ కుడిగా పేరున్న నాయకుడి మాటను కాదనలేక, నమ్మి ఏఈ డబ్బులు తీసుకున్నాడు. అయితే మంచి తనంతో ఆలోచించిన సదరు ప్రజానా యకుడిని అడ్డం పెట్టుకుని నేర చరిత్ర కలిగిన ఫిర్యాదుదారుడు అయన్ను సైతం మోసం చేయడం గమనార్హం. ఏది ఏమైనా తనకు ఏమాత్రం సంబంధం లేని డబ్బులను చేతికి తీసుకుని, చేయని నేరానికి ఒక నిజాయితీపరు డైన అధికారి తప్పుడు కేసులో ఇరుక్కున్నాడు. ఈ వ్యవహారంపై ఏసీబీ అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తే అసలు వాస్తవాలు, ఫిర్యాదుదా రుడి నేర చరిత్ర వెలుగులోకి వస్తాయని స్థాని కులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు అభిప్రాయప డుతున్నారు.

# భూ వివాదాలు లేని రాష్ట్రమే లక్ష్యం

**హైదరాబాద్, జూన్ 19- సిరిన్యూస్ :**

భూ సమస్యలు, భూ వివాదాలు లేని తెలంగాణ ను నిర్మించాలనే లక్ష్యంతో రాష్ట్రంలో భూ సర్వే నిర్వహించాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసు కుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీని వాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీసర్వే కార్యక్రమాన్ని వచ్చే నెల నుంచి దశల వారీగా ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. రెవెన్యూ అధికారులతో శుక్రవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలు ఉండగా తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల నుంచి 70 గ్రామాల చొప్పున మొత్తం 2240 గ్రామాలను ఎంపిక చేసి రీ సర్వే చేపట్ట నున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూమి రైతుకు ఆస్తి మాత్రమే కాదని, అది అతని జీవనా ధారమని, ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్, ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమ ని వివరించారు. భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఈ రీసర్వే కార్యక్రమం చరిత్రా త్మక మైలురాయిగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో 1936 నాటి నిజాం కాలపు సర్వే రికార్డులే ప్రధాన ఆధారంగా ఉన్నా యని, కాలక్రమేణా భూముల విభజనలు, ఉప సంఖ్యలు పెరగడం, పట్టణీకరణ విస్తరించడం, పరిపాలనా సరిహద్దులు మారడం వల్ల అనేక ప్రాంతాల్లో భూముల అసలు హద్దులపై స్పష్టత లేకుండా పోయిందని చెప్పారు. ఈ పరిస్థితుల కు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం సమగ్ర రీసర్వే చేపడుతోందని తెలిపారు. నిజాం కాలం నుంచి నక్షాలు లేని 378 గ్రా మాలను గుర్తించామని, వాటిలో ఇప్పటికే ఐదు గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి భూదార్ నంబర్లు కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన 373 గ్రామాల్లో కూడా రోవర్స్ వంటి ఆధునిక సాంకేతికతతో సర్వే పనులు వేగంగా కొనసా గుతున్నాయని చెప్పారు. గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత సర్వే పరికరాలకు పూర్తిగా స్వస్తి చెబుతున్నామని మంత్రి తెలిపారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్, క్యూజీఐఎస్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ శాస్త్రీయ పద్ధతిలో భూముల సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే 411 రోవర్స్ కొనుగోలు చేయగా, త్వరలో మరో 400 రోవర్స్ కొనుగోలు చేయను న్నట్లు వెల్లడించారు.

**ప్రతి సర్వే నంబర్‌కు భూదార్**

భూముల రీసర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూ కమతానికి ఖచ్చితమైన హద్దులను నిర్ణయించి, ప్రతి సర్వే నంబరుకు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు. ఆధార్ తరహాలో ప్రతి భూమికీ ప్రత్యేక గుర్తింపుగా భూదార్ కార్డులు జారీ చేస్తామని చెప్పారు. డీ జీపీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని క్యూ జీఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేసి భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వే నంబర్లు ఉండగా ప్రస్తుతం అవి 2.29 కోట్లకు పెరిగాయని, రాష్ట్రంలోని అన్ని సర్వే నంబర్లకు దశలవారీగా భూదార్ నంబర్లు కేటాయించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించిందని చెప్పారు. రీ సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన మానవ వనరులను ప్రభుత్వం సమకూర్చిందని, 5,520 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి లైసెన్సు లు జారీ చేశామని, భూవిస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి 4 నుంచి ఆరుగురు సర్వేయర్లను నియమించినట్లు వివరించారు. రెవెన్యూ గ్రా మాలను క్లస్టర్లుగా విభజించి ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భూ భారతి చట్టం ద్వారా సాగు భూముల రిజిస్ట్రేష న్లకు సర్వే పటం తప్పనిసరి చేసిన నేపథ్యంలో రీసర్వే ద్వారా భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రక్రియలు మరింత పారదర్శకంగా, వేగవం తంగా మారనున్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు.

# మైనర్ల డ్రైవింగ్‌ను క్షమించేది లేదు

**హైదరాబాద్,జూన్ 19 - సిరిన్యూస్:**

మైనర్లు డ్రైవింగ్ చేస్తే అస్సలు క్షమించమని హైదరాబాద్ సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభా రతిలో 'స్కూల్ పిల్లల భద్రత'పై స్కూల్ యాజమాన్యాలు, సంబంధిత శాఖలతో ట్రాఫిక్ పోలీసులు సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సిటీ పరిధిలో 3500లకు పైగా స్కూల్స్ ఉన్నాయని, వీటిలో 12 లక్షలకు పైగా విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. సేఫ్ స్కూల్ ఎన్విరాన్మెంట్ క్రియేట్ చేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిం చినట్లు చెప్పారు. విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ పాటించడం అన్నది అలవాటుగా మారాలని సూచించారు. విద్యాసంస్థల్లో ర్యాంక్స్ ఇంపార్టెంట్ కాదని.. సేఫ్ ఎన్వి రాన్మెంట్ ముఖ్యమని సీపీ స్పష్టం చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో స్కూల్ బస్సు డ్రైవర్లు పట్టుబడుతున్నారని తెలిపారు. విద్యార్థులు స్కూల్‌కు ఏ విధంగా వస్తున్నారనే దానిపై స్కూల్ యాజమాన్యం వద్ద పూర్తి రూట్ మ్యా ప్ ఉండాలన్నారు. పిల్లలు పాఠశాలకు వస్తున్నారంటే.. ఏం జరిగినా స్కూల్ యా జమాన్యానిదే బాధ్యత అని తేల్చిచెప్పారు. స్కూల్ బస్సులను నడిపే డ్రైవర్స్‌పై నిఘా ఉంచాలని సీపీ సూచించారు. ట్రాఫిక్ వా లంటీర్లు, మార్షల్స్‌ను విద్యాసంస్థలు నియ మించుకోవాలని అన్నారు. పిల్లలు తెలిసీ తెలియక నేరాల్లో ఇన్వాల్వ్ అవుతున్నార ని.. పిల్లలపై టీచర్స్, పేరెంట్స్ పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. స్కూల్ పరిసరాల్లో ఖచ్చితంగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. స్కూల్ పరిసరా ల్లో పొగాకు ఉత్పత్తులు అమ్మడం నేరమని, అలాంటి వాటిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. దేశవ్యాప్తంగా ప్రతిరోజు 45 మంది విద్యార్థులు యాక్సిడెంట్లో చని పోతున్నారని, యాక్సిడెంట్లు మర్డర్ల కంటే ప్రమాదకరమన్నారు. అందుకే స్కూల్ వి ద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించాలని సీపీ సజ్జనార్ వెల్లడించారు.

# అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు సమన్లు

**హైదరాబాద్, జూన్ 19 - సిరిన్యూస్:**

సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో హీరో అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు సమన్లు జారీ చేసింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న అల్లు అర్జున్‌తో పాటు ఇతర నిందితులు కూడా సోమవారం నాడు వ్యక్తిగతంగా కోర్టు ఎదుట హాజరుకావాలని న్యాయ స్థానం ఆదేశించింది. 'పుష్ప2' సినిమా ప్రీమియర్ ప్రదర్శన సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.
ఈ ఘటనపై పోలీసులు సుదీర్ఘ దర్యాప్తు చేపట్టి అల్లు అర్జున్‌ను ఏ11గా పేర్కొంటూ ఛార్జ్ షీట్ దాఖలు చేశారు.
ఈ కేసులో మొత్తం 23 మందిని నిందితు లుగా చేర్చిన పోలీసులు, సంధ్య థియేటర్ యాజమాన్యం, నిర్వాహకులను ప్రధాన నిందితులుగా పేర్కొన్నారు. దాఖలైన ఛార్జ్ షీట్‌ను పరిశీలించిన నాంపల్లి కోర్టు విచారణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తూ అల్లు అర్జున్‌తో పాటు మరో 19 మందికి సమన్లు జారీ చేసింది.
ప్రీమియర్ ప్రదర్శన రోజున అభిమానులు భారీ సంఖ్యలో తరలిరావడం, తగిన భద్రతా ఏర్పాట్లు లేకపోవడం వల్ల తొక్కి సలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఓ మహిళ మృతి చెందగా, పలువురు గాయ పడ్డారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తేం దుకు, నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరో పణలపై నమోదైన ఈ కేసు ప్రస్తుతం కోర్టు విచారణ దశకు చేరుకుంది. తాజా సమన్ల నేపథ్యంలో అల్లు అర్జున్ సహా నిందితులు సోమవారం కోర్టుకు హాజరవుతారా అనే అంశంపై ఆసక్తి నెలకొంది.

# ఫేక్ ఐడీలతో యువతులకు టోకరా

**మెదక్, జూన్ 19:**

సామాజిక మాధ్యమాల్లో నకిలీ ఖాతాలు సృష్టించి యువతులను మోసం చేసిన ఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలో వెలుగుచూసింది. పెళ్లి చేసుకుంటానంటూ నమ్మించి ఇద్దరు యువతుల నుంచి లక్షల రూపాయలు, బంగారం కాజేసిన యువకు డిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.
స్థానికుల కథనం ప్రకారం ఎల్లంపల్లి గ్రామా నికి చెందిన ఉప్పరి దుర్గయ్య ఇన్‌స్టాగ్రామ్‌లో తన పేరును రిత్విక్ రెడ్డిగా మార్చుకుని అదే గ్రామానికి చెందిన ఓ యువతికి స్నేహ అభ్యర్థన పంపించాడు. ఆమె అంగీకరించిన తర్వాత తాను ఛత్తీస్‌గఢ్‌లో ఐపీఎస్ శిక్షణ పొందుతున్నానని నమ్మించాడు.
పెళ్లి చేసుకుంటానని హామీ ఇస్తూ ఖర్చుల కోసం డబ్బులు కావాలని చెప్పి యువతి నుంచి రూ.5 లక్షలతో పాటు తులం బంగారు కమ్మలను తీసుకున్నట్లు ఆరోపణ లు ఉన్నాయి.
అంతటితో ఆగకుండా మరో నకిలీ ఖాతా సృష్టించి సాత్విక్ రెడ్డి పేరుతో ఏ క్లాస్ పూర్ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికకు స్నేహ అభ్యర్థన పంపాడు. ఆమెతో పరిచయం పెంచుకుని తాను ఎంబీబీఎస్ చదువు తున్నానని చెప్పి, విద్యా ఖర్చుల పేరుతో విడతల వారీగా రూ.7 లక్షలు తీసుకున్నట్లు సమాచారం.
డబ్బులు తీసుకున్న అనంతరం ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అందుబాటులో లేకపోవడంతో ఇద్దరు బాధితులు మోసపోయినట్లు గుర్తిం చారు. అనంతరం టేక్మాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.
ఈ ఘటన కొంత ఆలస్యంగా వెలుగులోకి రావడంతో స్థానికంగా చర్చనీయాంశమైం ది. సామాజిక మాధ్యమాల్లో పరిచయాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

# వర్షా కాలానికి ముందస్తు సన్నద్ధత

**హైదరాబాద్, సిరి న్యూస్:**

రాష్ట్రవ్యాప్తంగా వర్షాకాలం రాకముందే విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరా యాలు తలెత్తకుండా టీజీఎస్పీడీసీఎల్ ముందస్తు చర్యలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా నిర్వహిస్తున్న 'పోల్స్ అండ్ లైన్స్ స్పెషల్ డ్రైవ్ - వాక్ అలోంగ్ ది లైన్' కార్యక్రమంలో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ శుక్రవారం బం జారాహిల్స్‌లోని సాగర్ సొసైటీ ఫీడర్ పరిధిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ పర్యటనలో విద్యుత్ నెట్‌వర్క్‌ను ఆయన లైన్‌టులైన్ సర్వే ద్వారా సమగ్రంగా పరిశీ లించారు. ముగ్ధా సిల్క్స్ సమీపంలోని 11 కేవీ విద్యుత్ లైన్‌ను పరిశీలించి, నెట్‌వ ర్క్‌లో గుర్తించిన లోపాలపై అధికారులకు, సిబ్బందికి కీలక సూచనలు జారీ చేశారు. అనంతరం రోడ్ నెం.10, జూబ్లీహిల్స్ క్లబ్ వెనుక భాగంలో జరుగుతున్న చెట్ల కొమ్మల కత్తిరింపు పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షిం చారు. విద్యుత్ లైన్లకు సమీపంగా ఉన్న కొమ్మలను సకాలంలో తొలగిం చడం ద్వారా వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేయాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు, హెచ్‌టీ/ఎల్‌టీ లైన్లు, డిస్ట్రి బ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, జంపర్ల పరి స్థితిని సమీక్షించిన ఆయన.. వినియోగ దారుల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని స్పష్టం చేశారు.

**లైన్‌మెన్‌లతో ఆత్మీయ పలకరింపు..**

క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం బంజా రాహిల్స్ సెక్షన్‌కు చెందిన లైన్‌మెన్‌లతో సీఎండీ జితేష్ వి. పాటిల్ ఒక సాధారణ అధికారిలా ముచ్చటించారు. క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సవాళ్లు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ని ర్వహణ పనుల్లో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించి విద్యుత్ సరఫరా నాణ్యతను పెంచాలని సూచించారు. సీఎండీ స్థాయి అధికారి తమతో సామాన్యుడిలా ఆత్మీయం గా మాట్లాడటం పట్ల సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్. నరసింహులు, చీఫ్ ఇంజనీర్ (మెట్రో జోన్) భిక్షపతి, సూపరిం టెండింగ్ ఇంజనీర్ (బంజారాహిల్స్) శ్రీనివా స్ రెడ్డి, ఏడీలు, ఏఈలు తదితర విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు..

- సేవా కార్యక్రమాలు నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు

**రామచంద్రపురం (పటాన్‌చెరు), జూన్ 19, (సిరి న్యూస్):**

పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ 56వ జన్మదినాన్ని పురస్కరించుకుని పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ముత్తంగి డివిజన్‌లో మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ నీలం మధు ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అలాగే సంగారెడ్డి జిల్లా ఐఎన్‌టీయూసీ, పటాన్‌చెరు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కోల్కూరి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో కేక్ కట్ చేసి రోగులు, వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ దేశ సమగ్రత, లౌకిక విలువల పరిరక్షణ కోసం త్యాగాలు చేసిన కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ యువత, రైతులు, కార్మికులు, బడుగు బలహీన వర్గాల గొంతుకగా రాహుల్ గాంధీ నిలుస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమాల్లో మాజీ పీసీసీ కార్యదర్శి మతీన్, రాధాకృష్ణ పంతులు, అశోక్ ముదిరాజ్, కౌన్సిలర్ నర్సింహారెడ్డి, రవి ముదిరాజ్, సాయిలు ముదిరాజ్, మెట్టు రాజు యాదవ్, మందుముల శ్రీనివాస్, అక్తర్, భారత్, వేణు, ఈశ్వర్ సింగ్, రతన్ సింగ్, అక్షిత్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.




సంపాదకీయం

# డిజిటల్ యుగంలో సాహిత్యం సజీవ స్వరం !

సాహిత్యం కేవలం సమాజానికి అద్దం పట్టడం మాత్రమే కాదు, సమాజం ఏ దిశగా పయనించాలో మార్గనిర్దేశం చేసే ఒక నిరంతర చైతన్య స్రవంతి. మానవ నాగరికత పరిణామ క్రమంలో ఎన్నో విప్లవాలు వచ్చినా, మరెన్నో సాంకేతిక మార్పులు సంభవించినా.. మనిషి అంతరంగాన్ని, సమాజపు లోతుపాతులను అక్షరబద్ధం చేసే సాహిత్యానికి ఉన్న శక్తి అనన్యసామాన్యం. అయితే, ప్రస్తుత 2026 నాటి కృత్రిమ మేధ, డిజిటల్ విప్లవ కాలంలో 'సాహిత్య ఉనికి మరియు ప్రాధాన్యత'పై ప్రపంచవ్యాప్తంగా సరికొత్త చర్చలు నడుస్తున్నాయి. పుస్తకాల రూపురేఖలు మారుతున్నా, అక్షరం సృష్టించే ప్రభావం మాత్రం ఇప్పటికీ చెక్కు చెదరలేదు. ఒకప్పుడు సాహిత్యం అంటే కేవలం ముద్రిత పుస్తకాలకే పరిమితం. కానీ నేడు ఇ-బుక్స్, ఆడియో బుక్స్, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల రూపంలో సాహిత్యం పాఠకుడికి మరింత చేరువైంది. ముఖ్యంగా నేటి యువత సుదీర్ఘమైన నవలలు చదవడానికి సమయం లేకపోయినా, ప్రయాణాల్లోనూ, ఖాళీ సమయాల్లోనూ ఆడియో పుస్తకాల ద్వారా క్లాసిక్ నవలలను వినడానికి ఆసక్తి చూపిస్తోంది. ఈ సాంకేతికత ప్రాంతీయ సరిహద్దులను బద్దలు కొడుతూ.. తెలుగు సాహిత్యాన్ని ప్రపంచ వేదికలపైకి తీసుకెళ్లేందుకు ఒక అద్భుతమైన వంతెనగా మారింది.



### కృత్రిమ మేధ వర్సెస్ మానవ సృజనాత్మకత

ప్రస్తుత తరుణంలో సాహిత్య లోకాన్ని పట్టిపీడిస్తున్న అతిపెద్ద ప్రశ్నఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.. కవుల, రచయితల స్థానాన్ని భర్తీ చేయగలదా? అన్నది. చాట్-బాట్‌లు క్షణాల్లో కవితలు, కథలు రాసి ఇస్తున్న మాట వాస్తవమే అయినప్పటికీ.. ఒక మనిషి అనుభవించే బాధ, ప్రేమ, విప్లవం, కన్నీరు, గుండె లోతుల్లోంచి వచ్చే ఆవేదనను సాంకేతికత ఎప్పటికీ సృష్టించలేదు. యంత్రం పదాలను కూర్చగలదు కానీ, భావాన్ని, ఆత్మను పోయలేదు. మానవ జీవన ఘర్షణ నుండి పుట్టే సాహిత్యమే ఎల్లప్పుడూ సజీవంగా ఉంటుంది. నేటి వేగవంతమైన, యాంత్రికమైన సమాజంలో మనుషుల మధ్య సంబంధాలు బలహీనపడుతున్నాయి. ఇలాంటి సమయంలో సమాజానికి 'సంవిధానం' , 'సహానుభూతి'ని నేర్పాల్సిన బాధ్యత రచయితలపై మరింత ఎక్కువగా ఉంది. కేవలం వినోదం కోసమే కాకుండా, సామాజిక రుగ్మతలను ప్రశ్నించేలా, నైతిక విలువలను పెంపొందించేలా నేటి రచనలు సాగాలి. ముఖ్యంగా బాల సాహిత్యాన్ని తిరిగి బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. నేటి తరం పిల్లలను స్మార్ట్‌ఫోన్ల స్క్రీన్ల నుండి కాపాడి, అక్షరాల ప్రపంచంలోకి నడిపించడం సాహిత్యకారుల ముందున్న అతిపెద్ద సవాలు. సాహిత్యం అనేది ఒక కాలానికి సంబంధించిన రికార్డు. శతాబ్దాల క్రితం నాటి సమాజాన్ని మనం ఈరోజు తెలుసుకోగలుగుతున్నామంటే అది నాటి అక్షర బలమే. ముద్రణ రూపం మారవచ్చు, కాగితం స్థానంలో స్క్రీన్ రావచ్చు.. కానీ మనిషి ఉన్నంత కాలం ఆలోచన ఉంటుంది, ఆలోచన ఉన్నంత కాలం సాహిత్యం వర్ధిల్లుతూనే ఉంటుంది. ప్రపంచాన్ని మరింత అందంగా, శాంతియుతంగా మార్చగలిగే ఆయుధం అక్షరమేనని నమ్ముతూ.. సాహిత్య సృజనను, పఠనాసక్తిని ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత.

....ఎసిఎస్.రావు

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు.




**రామాయంపేట, జూన్ 19 (సిరి న్యూస్)**

మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్లమెంటు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాహుల్ గాంధీ జన్మదినం పురస్కరించుకొని మెదక్ చౌరస్తాలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబమని, భారత్ జూడో యాత్ర ద్వారా దేశంలో పాదయాత్ర చేపట్టి ప్రజల సమస్యలు తెలుసుకున్న నాయకుడు రాహుల్ గాంధీ అని తెలిపారు. రాబోవు రోజుల్లో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవడం ఖాయమని ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ లు గజవాడ నాగరాజు, దేవుని రంజిత్, పుట్టి సందీప్, రవి నాయక్, కోఆప్షన్ సభ్యులు దేమే యాదగిరి, మహమ్మద్ గౌస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పోచమ్మ గణేష్, జిల్లా ఉపాధ్యక్షులు చింతల యాదగిరి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ రెడ్డి, నాయకులు దాకీ స్వామి, చింతల స్వామి తదితరులు పాల్గొన్నారు.

# రైతు బోరు కేబుల్ చోరీ.. ఆందోళనలో రైతు

**శివ్వంపేట,జూన్ 19(సిరి న్యూస్ )**

మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గంగాయిపల్లి గ్రామంలో రైతు బోరుకు సంబంధించిన కేబుల్ వైరు చోరీ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు పద్మచారి వ్యవసాయ బోరుకు అమర్చిన సుమారు 8 మీటర్ల కేబుల్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు చాటర్ డబ్బా (స్టార్టర్ బాక్స్) నుంచి అపహరించినట్లు రైతు పద్మాచారి తెలిపారు రైతు పద్మచారి తన వ్యవసాయ పొలానికి వెళ్లిన సమయంలో బోరు వద్ద కేబుల్ వైరు కనిపించకపోవడంతో చోరీ జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఆయన తీవ్ర ఆందోళనకు గురయ్యారు.



సాగు పనులు కీలక దశలో ఉన్న సమయంలో కేబుల్ వైరు చోరీ కావడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఇటీవల వ్యవసాయ మోటార్లు, కేబుల్ వైరులు లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న చోరీల కారణంగా రైతులు భయాందోళనలకు గురవుతున్నారని గ్రామస్తులు తెలిపారు. వ్యవసాయానికి సంబంధించిన విద్యుత్ సామగ్రి చోరీలు పెరుగుతుండటంతో రైతులు తమ బోర్లు, మోటార్లు, కేబుల్ వైరుల భద్రతపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# రైతులను నట్టేట ముంచుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- నర్సాపూర్ శాసనసభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి

**వెల్దుర్తి, జూన్ 19,(సిరి న్యూస్ ):**

వెల్దుర్తి మండలం మెల్లూరు గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన పాఠశాల ప్రవారి గోడ అలాగే పెద్దాపూర్ పిట్టల వాడలో సీసీ రోడ్డులను ప్రారంభించిన అనంతరం గ్రామంలో మీడియా సమావేశం నిర్వహించిన సునీత రెడ్డి మాట్లాడుతూ వెల్దుర్తి మండలం లోని చెట్టుపల్లి, రామయపల్లి, ఉప్పులింగాపూర్, దామరంచ, వెల్దుర్తికి రెండు గ్రామ సమైక్య మహిళ భవనం మంజూరు కావడం జరిగింది. ఒక్కొక్క మహిళ భవనానికి 10 లక్షల రూపాయలు మంజూరు కావడం జరిగిందని, అలాగే పాఠశాలలకు కూడా ప్రహరీ గోడకు గతంలో కెసిఆర్ నాయకత్వంలో పాఠశాలలు అన్ని అభివృద్ధి ప్రగతి పతంలో నడిచే విధంగా అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా మన ఊరు మనబడి కార్యక్రమం ద్వారా మంచి పాఠశాల భవనాలను ఏర్పాటు చేయడం జరిగింది. కానీ కొన్ని పాఠశాల భవనాలకు ప్రహరీ గోడలు ఉన్నాయి. కొన్ని భవనాలకు ప్రహరీ గోడ లేదు. గత సంవత్సరం ఉపాధి పథకం ద్వారా కొన్ని భవనాలకు ప్రహరీ గోడ మంజూరు కావడం జరిగిందని, అలాగే ఇప్పుడు కూడా కొన్ని గ్రామాలకు ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని,శేంశ రెడ్డి పల్లి తాండ, బండమీదిపల్లి, చర్లపల్లి, కోట కింద, బండ పోసానిపల్లి, ఏదులపల్లి, ధర్మారం ఈ గ్రామాలకు సంబంధించిన ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు కావడం జరిగింది. అలాగే ఉపాధి హామీ పథకం ద్వారా అన్ని గ్రామాలకు సిసి రోడ్లు కూడా మంజూరు జరిగిందని, ఆమె తెలిపారు. అలాగే మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులను కోరడం ఏమనగా వచ్చిన ఈ నిధులను సద్వినియోగపరుచుకోవాలని, అలాగే ఈ నిధులు రాష్ట్రానికి సంబంధించినవి కావు, కేంద్రానికి సంబంధించినవి. ఈరోజు ప్రభుత్వం ఏం చేస్తుందంటే రైతులను రాజు చేస్తాం అన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతును నట్టేట ముంచేటట్టుగా చేస్తుందని ఆమె మండిపడ్డారు.రైతులకు సంబంధించి ప్రతి ఎకరాకు 15 వేల రూపాయలు ఇస్తామన్నారు. రైతు కూలీలకు కౌలు రైతులకు 12 వేల రూపాయలు ఇస్తామన్నారు. అది కూడా ఇప్పటివరకు ఇవ్వలేదు.మొన్న కొనుగోలుకు సంబంధించి ఎంత కష్టమైందని, ప్రతి ఒక్క రైతుకు అర్థమైంది. కెసిఆర్ పరిపాలనలో రైతును గౌరవించే విధంగా కార్యక్రమాలు చేపడితే ఈరోజు కాంగ్రెస్ పార్టీ రైతుకు సంబంధించి కళ్ళలో నీళ్లు



తీసుకునే విధంగా చేస్తున్నారని ఆమె మండిపడ్డారు.. నిన్న క్యాబినెట్ సమావేశంలో ప్రజలకు ఏం ఉపయోగపడే కార్యక్రమాలు చేయాలని ప్రభుత్వం ఆలోచన చేయాలి. కానీ ప్రభుత్వం ప్రజలను ఇంకా నష్టపరిచే విధంగా క్యాబినెట్ సమావేశంలో చర్చించడం విడ్డూరమని ఇలాంటివి గతంలో ఎప్పుడు జరగలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఇప్పటివరకు రైతు బీమాకు సంబంధించిన ప్రీమియం రూపాయలు చెల్లించకపోవడం విడ్డూరమని ఆమె మండిపడ్డారు. యూరియా కూడా యాప్ ద్వారా తీసుకోవడం రైతులకు చాలా ఇబ్బందికరంగా ఉంటుందని యాప్ లేకుండా షాపులు ద్వారానే రైతులకు అందజేయాలని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# గుమ్మడిదలలో బీఎల్వోలకు ప్రత్యేక శిక్షణ

**గుమ్మడిదల, జూన్ 19( సిరి న్యూస్ ):**

గుమ్మడిదల మండల కేంద్రంలో బూత్ స్థాయి అధికారులకు (బీఎల్వోలు) ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల తహసిల్దార్ పరమేశం, మున్సిపల్ కమిషనర్ దశరథ్ హాజరయ్యారు. భారత ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన ఈసీఐనెట్ యాప్‌లోని ప్రత్యేక ముందస్తు ఓటర్ల సవరణ-2026 మాడ్యూళ్ల వినియోగంపై మాస్టర్ ట్రైనర్లు ప్రసాద్, రాంచంద్రారెడ్డి బీఎల్వోలకు శిక్షణ అందించారు. యాప్‌లో భాషా ఎంపిక, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, ఓటర్ల ధృవీకరణ, డ్రాఫ్ట్ రోల్ పరిశీలన, 85 ఏళ్లు పైబడిన ఓటర్లు మరియు ఏఎస్‌డీ ఓటర్ల పునఃధృవీకరణ వంటి అంశాలను వివరించారు.ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ ఎన్నికల జాబితాల నాణ్యత పెంపులో బీఎల్వోల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా ధృవీకరించి యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. మండల రెవెన్యూ, మున్సిపల్ సిబ్బందితో పాటు బీఎల్వోలు కార్యక్రమంలో పాల్గొన్నారు.



# ప్రజల విశ్వాసమే ప్రజాప్రతినిధుల బలం

- 13వ వార్డులో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం
- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత
- ఎన్నికల హామీల అమలుకు కృషి చేయాలి
- ఆదర్శ వార్డుగా 13వ వార్డు అభివృద్ధి లక్ష్యం

**గుమ్మడిదల, జూన్ 19( సిరి న్యూస్):**

గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని 13వ వార్డు అభివృద్ధికి మరో ముందడుగు పడింది. వార్డులో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శుక్రవారం స్థానిక కౌన్సిలర్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ వార్డుల అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా చేసుకుని కౌన్సిలర్లు ముందుకు సాగాలని సూచించారు. ప్రజలు తమపై ఉంచిన విశ్వాసంతో ఓటు వేసి గెలిపించారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని అన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యాల కల్పన వంటి అంశాల్లో దశలవారీగా పనులు చేపడుతున్నామని చెప్పారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే వార్డు ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడి, వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రజా ప్రతినిధులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన సూచించారు. అభివృద్ధి పనులు ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉండేలా కౌన్సిలర్లు నిరంతరం ప్రజలతో మమేకమై పనిచేయాలని కోరారు. వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అభివృద్ధి పనుల్లో ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, సంధ్య, స్థానిక కౌన్సిలర్ ఆకుల మాధవి, పద్మ, ప్రమీల, రమేష్, మున్సిపల్ కమిషనర్ దశరథ, నాయకులు మద్దెటి బాలరాజు యాదవ్, మద్దెటి మల్లేష్ యాదవ్, బాల్ శెట్టి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలి..

### మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి



**రామచంద్రపుర, జూన్ 19, (సిరి న్యూస్):**

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు ముందుకు వచ్చి సహకరించాలని మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన వసతులు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని ఆమె పేర్కొన్నారు.భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సేల్స్‌ఫోర్స్ కంపెనీ ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాగులు, పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై సేల్స్‌ఫోర్స్ ప్రతినిధులతో చర్చించారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన సహకారం అందించడంతో పాటు మౌలిక వసతుల మెరుగుదలకు త్వరలోనే చర్యలు చేపడతామని సంస్థ ప్రతినిధులు హామీ ఇచ్చారు.కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు సహకరిస్తున్న సేల్స్‌ఫోర్స్ ఉద్యోగులను సింధు అభినందించారు.ఈ కార్యక్రమంలో సేల్స్‌ఫోర్స్ ఉద్యోగులు కార్ల్ లార్సినా, అర్జున్ సాహా, పాండురంగారావు రాళ్లపల్లి, ఎల్ఐజీ కాలనీ అధ్యక్షులు యాదగిరి రెడ్డి, డైరెక్టర్ శామ్యూల్ జాన్, సత్యవతి, సరిత తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ నగర్ నీటి సమస్యల పరిష్కారం కోరిన సింధు ఆదర్శ్ రెడ్డి

**రామచంద్రపురం, జూన్ 19, (సిరి న్యూస్):**




భారతీనగర్ డివిజన్ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్‌ను కోరారు.విద్యుత్‌నగర్ కాలనీ గతంలో మున్సిపాలిటీ పరిధిలో ఉండి ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలోకి వచ్చిన నేపథ్యంలో, బోర్‌వాటర్ మరియు మంజీరా నీటి సరఫరా వ్యవస్థలను హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అమీన్‌పూర్ సర్కిల్‌కు అప్పగించి ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ అంశంపై హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులతో సమన్వయం చేసి సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అదేవిధంగా భారతీనగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాల్సిన అవసరాన్ని జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం..

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**రామచంద్రాపురం, జూన్ 19, (సిరి న్యూస్):**



భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం అందిస్తామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. కార్మికుల సంక్షేమం, భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.తెల్లాపూర్‌లో తెలంగాణ రాష్ట్ర భవన మరియు ఇతర నిర్మాణ రంగాల కార్మికుల సంఘం కార్యాలయ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ, పటాన్‌చెరు నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో నిర్మాణ రంగ కార్మికుల పాత్ర మరింత కీలకంగా మారిందన్నారు.కార్మికుల సంఘం కోసం త్వరలోనే స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు కార్మికులకు చేరేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రతి కార్మికుడు గ్రూప్ ఇన్సూరెన్స్ కలిగి ఉండేలా సంఘం ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, నాయకులు మల్లారెడ్డి, శ్రీశైలం, దయాకర్, పాల్ రెడ్డి, నాగరాజు, సాగర్, హర్ష, ఇంద్రారెడ్డి, సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 20న జాతీయ మెగా లోక్‌అదాలత్.

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ.

**మెదక్, జూన్, 19(సిరి న్యూస్)**



మెదక్ జిల్లా న్యాయస్థానం పరిధిలో ఈనెల 20న ఉదయం 10 గంటలకు జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయశాఖ చైర్పర్సన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ తెలిపారు .శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజీ పడదగిన కేసులన్నీ రాజకుదురుకొని సంతోషంగా ఉండాలన్నారు. ప్రతి మనిషిలో క్షమా గుణం కలిగి ఉండాలన్నారు. రాజీ కుదురుచుకుంటే మానసిక ప్రశాంతత ఏర్పడుతుందన్నారు. క్షణికావేశంలో పెట్టుకున్న కేసులన్నీ రాజీ కుదురుచుకుంటే ఇరు వర్గాలు సంతోషంగా స్నేహపూర్వకంగా ఉండొచ్చఅన్నారు. భార్యాభర్తలు తగాదలు పడితే వారికి కౌన్సిలింగ్ ఇచ్చి సర్ది చెప్పాలని త ద్వారా వారి భవిష్యత్తు బాగుంటుందన్నారు .మెదక్ జిల్లాలో నేటి వరకు సుమారు 3వేల కేసులు రాజీ కుదిర్చినట్లు తెలిపారు.శనివారం మెగా జాతీయ లోక్ అదాలత్ లో కేసులను పరిష్కరిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ఫస్ట్ ఎడిషనల్ కోర్టు జడ్జ్ శ్రీమతి సుబవల్లి జిల్లా న్యాయ అధికార సంస్థ కార్యదర్శి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షకు సర్వం సిద్ధం..!

- **అభ్యర్థులు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి.**
- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**

**మెదక్,జూన్,19 (సిరి న్యూస్)**





జిల్లాలో ఈ నెల 21 ఆదివారం మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.15 గంటల వరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్ లో నిర్వహించనున్న నీట్ (యూజీ)–2026 పరీక్షను పారదర్శకంగా, ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు.జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన 01 పరీక్షా కేంద్రాంలో మొత్తం 481మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని వెల్లడించారు.పరీక్షా నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు.ఈ సందర్భంగా పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు.

**అభ్యర్థులు వెంట తీసుకురావాల్సినవి:**

★ ఎన్‌టిఏ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న అడ్మిట్ కార్డు.

★ ఆధార్ కార్డు / పాన్ కార్డు / పాస్‌పోర్ట్ / స్టూడెంట్ ఐడీ వంటి ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డు.

★ రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఒక పోస్ట్‌కార్డ్ సైజ్ ఫోటో.

★ పారదర్శక (ట్రాన్స్‌పరెంట్) నీటి బాటిల్ మాత్రమేనని వెల్లడించారు.

**పాటించాల్సిన సూచనలు:**

★ అడ్మిట్ కార్డులో పేర్కొన్న గేట్ క్లోజింగ్ సమయం (మధ్యాహ్నం 1.30 గంటలు) కంటే ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి

★ ఇన్విజిలేటర్ సమక్షంలో ఓఎంఆర్ షీట్, హాజరు పట్టికపై సంతకాలు చేయాలి.

★ పరీక్షా కేంద్రంలో ఎన్‌టిఏ అందించే బ్లాక్ బాల్ పాయింట్ పెన్ మాత్రమే ఉపయోగించాలి

**నిషేధిత వస్తువులు:**

★ స్వంత పెన్నులు, పెన్సిల్లు, రబ్బర్లు తీసుకురావద్దు.

★ ఓఎంఆర్ షీట్‌పై అనవసర గుర్తులు చేయరాదు.

అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి రుమాలు, మొబైల్ ఫోన్, ఏ రకమైన గడియారం , బెల్ట్, ఆభరణాలు (ఉంగరాలు, గొలుసులు, చెవిపోగులు మొదలైనవి), ఎలక్ట్రానిక్ లేదా కమ్యూనికేషన్ పరికరాలు, పెన్సిల్, రబ్బరు, షార్పనర్, కరెక్షన్ ఫ్లూయిడ్ వంటి వస్తువులను తీసుకురావద్దన్నారు.అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. నీట్ పరీక్ష కోసం పోలీస్ శాఖ నుండి బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్ష ప్రశాంతంగా నిర్వహించుకోవడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో చేరిన AAPC చైర్మన్ పిల్లలు

**వెల్దుర్తి, జూన్ 19, (సిరి న్యూస్)**

ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో రోజురోజుకూ నమ్మకం పెరుగుతోందనడానికి వెల్దుర్తి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఒక చక్కని నిదర్శనంగా నిలిచింది. అని చెప్పవచ్చు.సమాజంలో గౌరవప్రదమైన హోదాలో ఉన్న వ్యక్తులు సైతం తమ పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వ విద్యా వ్యవస్థను ఎంచుకోవడం విశేషం. ప్రవేట్ పాఠశాల నుండి ప్రభుత్వ పాఠశాలకు ఆకర్షిస్తున్న నాణ్యమైన విద్య తాజాగా AAPC చైర్మన్ కే. మాధురి తమ పిల్లలైన రిత్విక్ (1వ తరగతి), అశ్విత్ (4వ తరగతి)లను ప్రైవేట్ పాఠశాల నుండి వెల్దుర్తి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. అంతేకాకుండా, ప్రైవేట్ పాఠశాలల నుండి కూడా పలువురు విద్యార్థులు ఈ ప్రభుత్వ పాఠశాల వైపు మొగ్గు చూపారు అని ప్రధాన ఉపాధ్యాయురాలు సృజన అన్నారు.ప్రభుత్వం అందిస్తున్న ఆధునిక బోధనా పద్ధతులు, డిజిటల్ వసతులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజన పథకం తల్లిదండ్రులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. ఉపాధ్యాయుల 'బడిబాట' శ్రమకు దక్కిన ప్రతిఫలం ఈ అద్భుతమైన మార్పు వెనుక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సృజన, వారి ఉపాధ్యాయ బృందం పడిన కష్టం ఎంతో ఉంది.

★ వారు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్తూ, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యా ప్రమాణాలను తల్లిదండ్రులకు వివరించారు.

★ ముఖ్యంగా, చదువుకు దూరమైన ★నలుగురు డ్రాపౌట్ విద్యార్థులను★ గుర్తించి, వారిని తిరిగి బడిలో



చేర్పించడం ద్వారా ఉపాధ్యాయులు తమ అంకితభావాన్ని, సేవాభావాన్ని చాటుకున్నారు. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సృజన పాటు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, ఉపాధ్యాయ బృందం రీనా , దివ్య, వరలక్ష్మి, పాల్గొనడం జరిగింది.

## మెల్లూరు గ్రామంలో అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్న సునీత రెడ్డి

**వెల్దుర్తి,జూన్ 19,( సిరి న్యూస్ ):**

శుక్రవారం వెల్దుర్తి మండలంలో మెల్లూరు గ్రామంలో వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నర్సాపూర్ శాసన సభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి. గ్రామంలో 10 లక్షలతో నిర్మించిన స్కూల్ ప్రహరీ గోడను ప్రారంభించి మొక్కలు నాటారు.అనంతరం స్కూల్లో పిల్లల మధ్యాహ్నం భోజనం పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతుందా అని ఆరా తీసి స్వయంగా విద్యార్థులకు భోజనం వడ్డించారు..అనంతరం పెద్దాపూర్ గ్రామంలోని



పిట్టల వాడలో ఐదు లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించి అక్కడి పిట్టల వాడ ప్రజలతో ప్రజల స్థితిగతులు వాళ్ళ జీవన విధానాలు తెలుసుకొని వాళ్లకు ప్రభుత్వం తరఫున ఇల్లు,ఇతర సౌకర్యాలు కల్పిస్తా అని హామీ ఇవ్వడం జరిగింది.. అనంతరం బస్వాపూర్ గ్రామంలో జరుగుతున్న మొదటి వార్షికోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది..ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండల బి ఆర్ ఎస్ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, నాయకులు మోహన్ రెడ్డి, కృష్ణ గౌడ్, ప్రతాప్ రెడ్డి,పడిగా నరసింహులు, రమేష్ చందర్ గుప్తా, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్,శ్రవణ్ కుమార్, మెల్లూరు గ్రామ సర్పంచ్ రంగారెడ్డి, సీనియర్ నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు కార్యకర్తలు పాల్గొన్నారు..

## మున్సిపల్ కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలి

- **కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సీఐటీయూ డిమాండ్**
- **గుమ్మడిదల మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా, కమిషనర్‌కు వినతిపత్రం**

**గుమ్మడిదల, జూన్ 19( సిరి న్యూస్ ):**

మున్సిపల్ కార్మికులకు నెలకు కనీస వేతనంగా 26 వేల రూపాయలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి. నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో గుమ్మడిదల మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బి. నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 70 వేల మంది మున్సిపల్ కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడంలో మున్సిపల్ కార్మికుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు పరిశుద్ధత పనుల్లో నిమగ్నమై ప్రజలకు సేవలందిస్తున్నప్పటికీ, వారికి సరైన వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పంపు ఆపరేటర్లు, ఎలక్ట్రిషియన్లు, అటెండర్లు, పరిశుద్ధ కార్మికులు ఎన్నో సంవత్సరాలుగా విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ ఇప్పటికీ తాత్కాలిక ఉద్యోగులుగానే కొనసాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరందరినీ వెంటనే పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ రెడ్డి, మహేష్, వీరేశం, నరసింహ, సాయి, మల్లేష్, శ్రీశైలం, భాస్కర్‌తో పాటు పలువురు మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

**కార్మికులకు కనీస వేతనం 26 వేలు చెల్లించాలి**

గుమ్మడిదల మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం కింద నెలకు రూ.26 వేల రూపాయలు చెల్లించాలని మున్సిపల్ కార్మికులు ధర్నా చేసి వినతి



పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ కార్మికుల జీతాల నుంచి ప్రతి నెలా ఈఎస్ఐ, పీఎఫ్ నిధులు మినహాయిస్తున్నప్పటికీ, ఈఎస్ఐ కార్డు ద్వారా కుటుంబ సభ్యులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడం లేదని తెలిపారు. ఈ సమస్యపై మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులకు చట్టబద్ధమైన అన్ని సంక్షేమ సౌకర్యాలు కల్పించాలని, విధులు నిర్వహించే సమయంలో ప్రమాదవశాత్తు మరణించే కార్మికుల కుటుంబాలకు రూ.50 లక్షల బీమా సౌకర్యం అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## అయ్యప్ప నామస్మరణ తో రజతోత్సవ వేడుకలు.

- **వేడుకల్లో పాల్గొన్న జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు,**
- **గోపుర శిఖరానికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు.**

**మెదక్ జూన్,19(సిరి న్యూస్)**

మెదక్ పట్టణంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న రజతోత్సవ మహోత్సవాల సందర్భంగా మెదక్ జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాసరావు, శుక్రవారం



ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ గోపుర శిఖరానికి అభిషేకం నిర్వహించి, అయ్యప్ప స్వామి వారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ఎస్పీకి తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, జిల్లా శాంతి భద్రతలు మరింత బలోపేతం కావాలని అయ్యప్ప స్వామిని ప్రార్థించినట్లు ఎస్పీ తెలిపారు. రజతోత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ఎస్పీకి స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అర్ధాంతరంగా నిలిచిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం

- కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో లబ్ధిదారురాలి ఆవేదన..
- అధికారుల జోక్యం కోరుతున్న కుటుంబం

**మెదక్ జూన్ 19 సిరి న్యూస్**





తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద మంజూరైన ఇల్లు నిర్మాణం మధ్యలోనే నిలిచిపోవడంతో ఓ లబ్ధిదారురాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాపన్నపేట మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన బత్తుల శ్రావణికి మొదటి విడతలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది.ప్రభుత్వ విధానంలో భాగంగా ఇల్లు నిర్మాణ బాధ్యతను సంబంధిత కాంట్రాక్టర్‌కు అప్పగించారు. గృహ నిర్మాణానికి సంబంధించిన ఒప్పందాన్ని కూడా కాంట్రాక్టర్ హౌసింగ్ శాఖతో ,లబ్ధిదారులతో చేసుకున్నట్లు సమాచారం. ప్రారంభంలో నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ ఇంటిని బేస్‌మెంట్ స్థాయి వరకు నిర్మించి, మొదటి బిల్లు తీసుకొని ఆ తర్వాత పనులను నిలిపివేసినట్లు లబ్ధిదారురాలు ఆరోపిస్తున్నారు.జిల్లాలో ఇద్దరు కాంట్రాక్టర్లు ఉండటంతో ఈ ఇల్లు నిర్మాణ బాధ్యత ఎవరిదనే అంశంపై గందరగోళం నెలకొన్నట్లు తెలుస్తోంది. నిర్మాణం పూర్తి చేయాలని లబ్ధిదారురాలు పలుమార్లు ఫోన్ ద్వారా సంప్రదించినప్పటికీ, "ఈ పని నాది కాదు" అంటూ ఇద్దరు కాంట్రాక్టర్లు బాధ్యతను ఒకరిపై ఒకరు నెట్టుకుంటున్నారని ఆమె వాపోతున్నారు.ఈ సమస్యపై సంబంధిత హౌసింగ్ అధికారులకు, ఇందిరమ్మ ఇళ్ల పథక అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ, "చర్యలు తీసుకుంటాం" అనే హామీలు తప్ప ఇప్పటి వరకు ఎలాంటి పరిష్కారం లభించలేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.ఇల్లు మంజూరై నెలలు గడుస్తున్నా నిర్మాణం పూర్తికాకపోవడంతో లబ్ధిదారురాలు అద్దె ఇంటిలోనే నివసిస్తూ ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం. పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే ప్రభుత్వ లక్ష్యం క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల బాధ్యతారాహిత్యంతో నీరుగారుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, సంబంధిత కాంట్రాక్టర్ల బాధ్యతను నిర్ధారించి, పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారురాలు బత్తుల శ్రావణికి అందజేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు."ఇందిరమ్మ ఇల్లు కలగా మిగలకుండా అధికారులు వెంటనే స్పందించాలి" అని విజ్ఞప్తి చేస్తున్నారు.

# బ్యాంకు లింకేజీ నిధులతో మహిళా వ్యాపారానికి శ్రీకారం

**శివంపేట్ జూన్ 19 ( సిరి న్యూస్ )**

శివ్వంపేట మండలం పెద్ద గొట్టిముక్కుల గ్రామానికి చెందిన ఝాన్సీ సంఘ సభ్యురాలు సాకలి చంద్రకళ బ్యాంకు లింకేజీ నిధులతో "న్యూ ఎంటర్‌ప్రైజెస్" పేరుతో స్టేషనరీ, కిరాణా దుకాణాన్ని ప్రారంభించారు. ఈ దుకాణాన్ని గ్రామ సర్పంచ్ నవీన్ ప్రారంభించారు. మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా ఎదిగి స్వయం ఉపాధి అవకాశాలను



సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.కార్యక్రమంలో ఏపీఎం పెంటా గౌడ్, సీసీ యాదగిరి, తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్లు, వార్డు సభ్యులు, గ్రామ సంఘం అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, వీఓఏలు సంతోష, రేణుక, సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు. బ్యాంకు లింకేజీ నిధులతో మహిళలు చిన్న వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా బలోపేతం కావడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

# ప్రజల కల నెరవేర్చే దిశగా అడుగులు

- నాలుగో వార్డులో అభివృద్ధి పనులకు శ్రీకారం
- వార్డు కౌన్సిలర్ గోకర్ నిర్మల వేణుగోపాల్ గౌడ్

**గుమ్మడిదల, జూన్ 19( సిరి న్యూస్):**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో రూ.3.13 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో అన్నారం 4వ వార్డులో చేపట్టనున్న సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు కావడం పట్ల వార్డు కౌన్సిలర్ గోకర్ నిర్మల వేణుగోపాల్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మసీదు రోడ్డులో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నిర్మల వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ 4వ వార్డును అభివృద్ధికి ప్రజల సహకారంతో ముందుకు తీసుకుపోతున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వార్డులో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వార్డు ప్రజలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# సమాజ ఐక్యతకు వేదిక సంఘ భవనాలు

- సంఘ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్
- యువత అభివృద్ధికి కృషి చేయాలని పిలుపు
- అన్ని వర్గాల ప్రజలను ఏకతాటిపైకి రావడమే లక్ష్యం

**గుమ్మడిదల, జూన్ 19( సిరి న్యూస్):**

అన్ని వర్గాల ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావడమే లక్ష్యంగా ఎండీఆర్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకులు మాద్రి పృథ్వీరాజ్ అన్నారు. పురపాలక సంఘం పరిధిలోని గుమ్మడిదలలో నూతనంగా నిర్మించిన ముదిరాజ్ సంఘ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైనారు. పూజా



కార్యక్రమంలో పాల్గొన్నారు. ముదిరాజ్ సంఘం భవనం ముందు ఏర్పాటు చేసిన సంఘం జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావడంలో సంఘ భవనాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. సామాజిక ఐక్యత, సాంస్కృతిక విలువల పరిరక్షణ, యువత సాధికారతకు ఇటువంటి భవనాలు కేంద్రాలుగా మారాలని ఆకాంక్షించారు. ముదిరాజ్ సంఘం అభివృద్ధికి సంఘ నాయకులు, సభ్యులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ భవనం సామాజిక, విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికగా నిలిచి సమాజ ప్రగతికి దోహదపడాలని ఆకాంక్షించారు. యువత విద్య, ఉపాధి, సామాజిక సేవా కార్యక్రమాల వైపు దృష్టి సారించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

# రాయపోలు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ సాధన రష్మీ పెరుమాళ్

**రాయపోలు, జూన్ 19,(సిరి న్యూస్):**

సిద్ధిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం రాయపోలు పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా స్టేషన్ సిబ్బంది కిట్ ఆర్టికల్స్‌ను పరిశీలించిన సీపీ, విధుల్లో క్రమశిక్షణ పాటించాలని సూచించారు. అనంతరం స్టేషన్ రికార్డులను తనిఖీ చేసి, పెండింగ్‌లో ఉన్న కేసులు, వాటి దర్యాప్తు పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రాయపోలు పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశమైన సీపీ, వారి సమస్యలను తెలుసుకొని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. సిద్ధిపేట సురక్ష నేత్ర కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే ఉద్యోగ అవకాశాల కోసం ప్రయత్నిస్తున్న యువతకు సిద్ధిపేట పోలీస్ ఉద్యోగ మిత్ర వెబ్‌సైట్ గురించి పూర్తి సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నర్సింహులు, సీఐ లతీఫ్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎస్ఐ మానసతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం..

**హత్నూర, జూన్ 19,(సిరి న్యూస్):**

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం నాగులదేవుపల్లి గేటు సమీపంలోని పల్లె శివరాం అనే వ్యవసాయ పొలంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు.మృతుడు సుమారు 60 సంవత్సరాల వయస్సు కలిగిన పురుషుడిగా గుర్తించారు. తీవ్ర ఎండల కారణంగా వడదెబ్బ తగిలి ఉండొచ్చు అని మృతి చెందినట్లు , స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు పత్రాలు లభించకపోవడంతో వివరాలు తెలియరాలేదని ,మృతుడిని ఎవరైనా గుర్తించినట్లయితే వెంటనే హత్నూర పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు. నెంబరుకు 8712656752 సమాచారం అందించాలని ఎస్ ఐ శ్రీధర్ రెడ్డి తెలిపారు.



# రామాయంపేటలో విద్యుత్ సరఫరాకు తాత్కాలిక అంతరాయం...

**రామాయంపేట, జూన్ 19( సిరి న్యూస్)**

మెయింటెనెన్స్ పనుల కోసం శనివారం మధ్యాహ్నం 3 గంటల పాటు పవర్ షట్‌డౌన్‌ఉం టుందని ట్రాన్స్కో అధికారులు తెలిపారు.132 KV రామాయంపేట సబ్‌స్టేషన్‌లో అత్యవసర మెయింటెనెన్స్ పనుల కారణంగా శనివారం (20-06-2026) మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.ఈ షట్‌డౌన్ ప్రభావంతో లక్ష్మాపూర్, కాట్రియాల్, ఝాన్సీలింగాపూర్, కోనాపూర్, రామాయంపేట సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.విద్యుత్ వ్యవస్థ మెరుగుదల, సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల్లో భాగంగానే ఈ అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. పట్టణ, గ్రామ ప్రజలు ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు చేసుకుని విద్యుత్ శాఖకు సహకరించాలని రామాయంపేట ఏడీఈ ఆదయ్య, ఏఈ తిరుపతి రెడ్డి కోరారు.

# ప్రజల సూచనలతో సర్వీస్ రోడ్ ప్రణాళిక

- గ్రామస్తుల సూచనలతో క్షేత్రస్థాయిలో పరిశీలన
- సానుకూలంగా స్పందించిన ఎన్ హెచ్ ఏఐ అధికారి విజయేందర్ రెడ్డి

**మునిపల్లి, జూన్ 19 (సిరి న్యూస్):**



మునిపల్లి మండలం మొగ్దుంపల్లి చౌరస్తా వద్ద సర్వీస్ రోడ్ నిర్మాణం, బస్‌స్టాండ్ ఏర్పాటు, హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేయాలని గతంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రసూల్ పటేల్ ఎన్‌హెచ్‌ఏఐ గుల్బర్గా అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆ వినతిపై స్పందించిన ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఇటీవల ఇంజినీరింగ్ బృందంతో కలిసి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, సర్వీస్ రోడ్ నిర్మాణానికి ప్రాథమిక ప్రణాళికను సిద్ధం చేశారు.పనుల పురోగతిపై తెలుసుకునేందుకు రసూల్ పటేల్ కంకల్ టోల్‌ప్లాజా ఎన్‌హెచ్‌ఏఐ అధికారి విజయేందర్ రెడ్డిని కలిసి చర్చించారు. అనంతరం గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు విజయేందర్ రెడ్డి అధికార బృందంతో కలిసి మొగ్దుంపల్లి చౌరస్తా వద్దకు చేరుకుని స్థలాన్ని పరిశీలించారు. సర్వీస్ రోడ్ ఎక్కడ, ఎలా ఏర్పాటు చేస్తే ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉంటుందనే అంశంపై గ్రామస్తుల నుంచి సూచనలు, అభిప్రాయాలు స్వీకరించారు.ఈ సందర్భంగా విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామస్తుల సూచనలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి అన్ని కోణాల్లో పరిశీలించి ప్రజలకు అనుకూలంగా సర్వీస్ రోడ్ నిర్మాణంపై తుది నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు షఫీ, జంషీద్, చాంద్ పాషా పటేల్, ఈశ్వరయ్య, వీరన్న, ఎంపల్లి నాగిశెట్టి, వీరేశం, దయానంద్, శేఖర్, ఫెరోజ్ తదితరులు పాల్గొన్నారు.

# పెన్నార్ కార్మికుల భవిష్యత్తు కోసం బిఆర్టియునే గెలిపించండి..

**రామచంద్రపురం (పటాన్ చెరు), జూన్ 19, (సిరి న్యూస్):**



బండలగూడ లోని పెన్నార్ పరిశ్రమలో ఈ నెల 20న జరగనున్న కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బిఆర్టియు కార్మిక సంఘాన్ని బలపరిచి గంట గుర్తుపై ఓటు వేయాలని బిఆర్టియు రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి కార్మికులకు పిలుపునిచ్చారు.శుక్రవారం పరిశ్రమ ప్రధాన గేటు వద్ద బిఆర్టియు రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీపీ యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు పాల్గొని మాట్లాడారు. గత రెండు గుర్తింపు ఎన్నికల్లో కార్మికులు బిఆర్టియుపై నమ్మకం ఉంచి ఘన విజయాన్ని అందించారని, ఆ విశ్వాసానికి అనుగుణంగా కార్మికుల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు.రాబోయే రోజుల్లో కూడా కార్మికుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటామని తెలిపారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సహకారంతో ప్రతి కార్మికుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని చెప్పారు. వేతన సవరణ, ప్రమోషన్ పాలసీ అమలు, పదవీ విరమణ వయస్సు పెంపు, హౌసింగ్ సొసైటీ ఏర్పాటు, హెల్త్ ఇన్సూరెన్స్ పరిమితి పెంపు వంటి ప్రధాన డిమాండ్ల సాధన కోసం బిఆర్టియు నిరంతరం పోరాడుతుందని వెల్లడించారు.ప్రతి కార్మికుడు తన ఓటు హక్కును వినియోగించుకుని గంట గుర్తుకు ఓటు వేసి బిఆర్టియుకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడే సంఘానికే మద్దతు ఇవ్వాలని కోరారు

# ప్రభుత్వ భూమికి బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు..



**రామచంద్రాపురం, జూన్ 19, (సిరి న్యూస్):**

రామచంద్రాపురంలోని శ్రీ సాయి నగర్ కాలనీలో సర్వే నంబర్ 10లో ఉన్న 8 గుంటల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు గుర్తించి బోర్డు ఏర్పాటు చేశారు. కాలనీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు చేసిన ఫిర్యాదులు, నిరంతర అనుసరణతో ఈ ప్రక్రియ పూర్తయింది.ప్రభుత్వ భూమిని కబ్జాల బారిన పడకుండా కాపాడాలని కాలనీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు హైడ్రా, ఎమ్మార్వో కార్యాలయాలకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు స్థలాన్ని సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిగా నిర్ధారించారు.అనంతరం శుక్రవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సంబంధిత స్థలంలో ప్రభుత్వ భూమి బోర్డును ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని ఈ సందర్భంగా కాలనీ ప్రతినిధులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రంజిత్, జీపీఓ కుమార్, కాలనీ అధ్యక్షుడు తాళ్ల రవి కిరణ్ గౌడ్, వెల్ఫేర్ సొసైటీ కోశాధికారి పండరి, ఉపాధ్యక్షుడు అప్పల భాస్కర్‌తో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# మూసీ రివర్ ఫ్రంట్ కార్పొరేషన్ లో డైరెక్టర్ గా బి. హరినాథ రెడ్డి నియామకం

**హైదరాబాద్, జూన్ 19**

తెలంగాణ ప్రభుత్వం మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్డీసీఎల్)లో డైరెక్టర్ (ప్రాజెక్ట్ కోఆర్డినేషన్)గా తెలంగాణ అగ్నిమాపక శాఖ ప్రాంతీయ అగ్నిమాపక అధికారి (రీజినల్ ఫైర్ ఆఫీసర్) బి. హరినాథ రెడ్డిని నియమించింది. ఈ మేరకు మెట్రోపాలిటన్ ఏరియా & పట్టణాభివృద్ధి శాఖ జి.ఓ.ఆర్.టి. నెం.624ను శుక్రవారం జారీ చేసింది. హరినాథ రెడ్డిని జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్) పోస్టుకు ఒక సంవత్సరం పాటు డిప్యూటేషన్‌పై, ప్రస్తుత వేతనంతోనే నియమించారు. ఆయనను తక్షణమే విధుల నుంచి రిలీవ్ చేసి ఎంఆర్డీసీఎల్‌లో బాధ్యతలు స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్‌ను ప్రభుత్వం ఆదేశించింది. అలాగే అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని ఎంఆర్డీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్‌కు సూచించింది.

# మైనర్లకు పొగాకు విక్రయిస్తే కఠిన చర్యలు


## ఎస్పీ శబరీశ్

**మరిపెడ,జూన్19**



18 సంవత్సరాల లోపు మైనర్లకు పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే సంబంధిత వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శబరీశ్ హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో పాన్ షాపుల యజమానులు,కిరాణా దుకాణాల నిర్వాహకులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రతి పాన్ షాపు, కిరాణా దుకాణం వద్ద 18 ఏళ్ల లోపు మైనర్లకు పొగాకు ఉత్పత్తులు విక్రయించబడవు అనే బోర్డును తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు.మైనర్లకు పొగాకు ఉత్పత్తులు విక్రయించడం చట్టవిరుద్ధమని,అలాంటి ఘటనలు వెలుగులోకి వస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.అదేవిధంగా జిల్లాలో గంజాయి విక్రయాలు, రవాణా వంటి అక్రమ కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. గంజాయి అక్రమ రవాణా లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు, ఉపయోగకరమైన సమాచారానికి రూ.5 వేల నగదు బహుమతి అందజేస్తామని ఎస్పీ తెలిపారు.సమాజంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలనిఆయనపిలుపునిచ్చారు.

# ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్. కే .సుధాకర్ లాల్



**కొడంగల్ మున్సిపల్ (మం), జూన్,19**

కొడంగల్ మున్సిపాలిటీ లోని బ్రాహ్మణవాడ వార్డు లో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి,డాక్టర్. కె. సుధాకర్ లాల్ ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొని, బాలింత ఇల్లు సందర్శించి తల్లి బిడ్డ ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకోవడం డెంగ్యూ అవగాహన, దోమల పుట్టుక స్థావరాలను గుర్తించి ఎప్పటికపుడు దోమలు పుట్టకుండా కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు మరియు ప్రతి ఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించమని చెప్పడం జరిగింది. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంగడిరైచుర్ ను సందర్శించి అందరూ సకాలంలో డ్యూటీ కి వచ్చి ప్రజలకు సేవలు మరియు మందులు అందించాలని చెప్పడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో డాక్టర్. బుష్రా ఫాతిమా, వైద్యాధికారి PHC అంగడిరైచుర్. డాక్టర్. అమృత,MLHP. మణిమాల, PHN. అర్జున్, నారాయణ, MPHEO's పకీరప్ప, SUO. మధుసూదన్ రెడ్డి, MPHA ఎం.చంద్రకళ 2nd ANM.మరియు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాట్సాప్‌లో పాఠశాల విద్యా సేవలు ప్రారంభం

**హైదరాబాద్, జూన్ 19**




తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ పాలనలో మరో ముందడుగు వేస్తూ పాఠశాల విద్యా సేవలను వాట్సాప్ ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎల్‌బీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ సేవలను ప్రారంభించారు. విద్యాశాఖ, మీసేవ సంయుక్తంగా రూపొందించిన ఈ వేదిక ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 18 లక్షల మందికి పైగా విద్యార్థులు, తల్లిదండ్రులకు విద్యా పురోగతి, పరీక్షల వివరాలు, హాల్ టికెట్లు, మార్కుల మెమోలు, బోనఫైడ్, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు తదితర సేవలు నేరుగా వాట్సాప్‌లో అందనున్నాయి. తదుపరి దశలో విద్యార్థుల హాజరు, యూనిఫాంలు, పాఠ్యపుస్తకాల పంపిణీ, స్కాలర్‌షిప్‌లు, మధ్యాహ్న భోజన పథకం, ఆరోగ్య, క్రీడా కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు.

# ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, జూన్ 19**

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేసిన ఆయన, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, పోషకాహారం, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో అదనపు తరగతి గదులు, భోజనశాలల నిర్మాణం చేపడుతున్నామని, రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం కొనసాగుతోందని చెప్పారు. నాణ్యమైన విద్యలో మంచిర్యాల జిల్లా రాష్ట్రంలో మూడో స్థానంలో ఉందని పేర్కొంటూ, విద్యార్థులు

# “ప్రతి విద్యార్థి నేర్చుకోవాలి... ప్రతి పాఠశాల మెరుగుపడాలి...”

## జిల్లా కలెక్టర్

- FLN, నమోదు, YOC, డిజిటల్ లెర్నింగ్, FRS హాజరుపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక ఆదేశాలు
- జాతీయ PGI ర్యాంకింగ్స్‌లో నారాయణపేటకు మెరుగైన స్థానం సాధించేందుకు సమష్టిగా కృషి చేయాలి




**నారాయణపేట, జూన్ 19**

జిల్లాలో ప్రతి విద్యార్థి ప్రాథమిక చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలను పూర్తిస్థాయిలో సాధించేలా విద్యా కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గారు అధికారులను ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి విద్యా సమీక్షా సమావేశంలో జిల్లా విద్యా శాఖాధికారి, మండల విద్యాధికారులు, అకడమిక్ మానిటరింగ్ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. సమావేశంలో విద్యార్థుల అభ్యాస ఫలితాలు, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (FLN), బడిబాట, నమోదు, పాఠ్యపుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం, APAAR, UDISE, FRS హాజరు, YOC అమలు, డిజిటల్ లెర్నింగ్, ప్రీ–ప్రైమరీ విద్య తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.

**అభ్యసన నాణ్యత పెంపే ప్రధాన లక్ష్యం**

జిల్లా కలెక్టర్ గారు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో పిల్లల అభ్యాస నాణ్యత పెరగడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థుల అభ్యాస ఫలితాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ఇటీవల పదో తరగతి ఫలితాలలో మెరుగైన ప్రతిభ కనబరిచిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను అభినందిస్తూ, ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాలల బోధనా విధానాలను ఇతర పాఠశాలలకు విస్తరించాలని ఆదేశించారు.

**FLNపై ప్రత్యేక దృష్టి – ప్రతి చిన్నారి ప్రాథమిక నైపుణ్యాలు సాధించాలి**

ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (FLN) కార్యక్రమం అమలుపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా 1, 2 తరగతుల విద్యార్థులు చదవడం, రాయడం, సంఖ్యా అవగాహన వంటి ప్రాథమిక నైపుణ్యాలను పూర్తిగా సాధించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి తరగతి గదిలో విద్యార్థుల అభ్యాస స్థాయిని నిరంతరం అంచనా వేయాలని, అభ్యాసంలో వెనుకబడిన విద్యార్థులకు ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుండి 4 గంటల వరకు ప్రత్యేక రిమీడియల్ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. తెలంగాణ ఎడ్యుకేషన్ యాప్‌లో స్పాట్ అసెస్‌మెంట్లు క్రమం తప్పకుండా నిర్వహించి, డేటా ఆధారిత ఫీడ్‌బ్యాక్ ద్వారా బోధనను మరింత మెరుగుపరచాలని సూచించారు.

**ఖాన్ అకాడమీ, కాంప్లెక్స్ సమావేశాలు, ప్రీ-ప్రైమరీపై ప్రత్యేక శిక్షణలు**

ఖాన్ అకాడమీ వినియోగం, కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణ, నూతనంగా ప్రారంభమైన ప్రీ–ప్రైమరీ (PP) తరగతుల నిర్వహణ వంటి అంశాలపై ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణలు నిర్వహించాలని అకడమిక్ మానిటరింగ్ అధికారులకు (AMOs) జిల్లా కలెక్టర్ గారు సూచించారు. డిజిటల్ లెర్నింగ్ వేదికలను సమర్థవంతంగా వినియోగించడం, చిన్నారుల అభ్యాస అభివృద్ధికి తగిన బోధనా పద్ధతులను ఉపాధ్యాయులకు అందించేందుకు కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.

**బడిబాట ద్వారా 100% నమోదు లక్ష్యం**

జిల్లాలో కొనసాగుతున్న బడిబాట కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. పాఠశాల వయస్సు గల ప్రతి బాలబాలికను పాఠశాలలో చేర్పించడం, డ్రాప్‌అవుట్ విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్చడం, నిరంతర హాజరును నిర్ధారించడం కోసం గ్రామస్థాయిలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. జూన్ 20న నిర్వహించే తల్లిదండ్రుల సమావేశాలను సమర్థవంతంగా నిర్వహించి నమోదు, హాజరు, అభ్యాస నాణ్యతపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. నమోదు పూర్తయిన వెంటనే UDISE డేటాను నవీకరించాలని సూచించారు.

**జాతీయ PGI ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానం కోసం కృషి చేయాలి**

సమావేశంలో రాష్ట్ర, జాతీయ స్థాయి పనితీరు సూచికలపై కూడా సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయి డిస్ట్రిక్ట్ మానిటరింగ్ ర్యాంకింగ్స్‌లో నారాయణపేట జిల్లా 21వ స్థానంలో ఉన్న నేపథ్యంలో, అన్ని సూచికలలో మెరుగైన ఫలితాలు సాధించి జిల్లాను మరింత ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్ గారు పిలుపునిచ్చారు. ప్రత్యేకంగా జాతీయ స్థాయి Performance Grading Index (PGI) ర్యాంకింగ్స్‌లో జిల్లాకు మెరుగైన స్థానం సాధించేందుకు ప్రతి అధికారి, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. అభ్యాస ఫలితాలు, నమోదు, హాజరు, మౌలిక సదుపాయాలు, డిజిటల్ లెర్నింగ్, APAAR, UDISE తదితర అన్ని సూచికలలో నాణ్యత పెంపు ద్వారా జిల్లాను జాతీయ స్థాయిలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని అన్నారు.

**APAAR, UDISE లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి**

APAAR నమోదు ప్రక్రియను వేగవంతం చేసి ప్రతి విద్యార్థికి అకడమిక్ ఐడెంటిటీ సృష్టించే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నమోదు పూర్తయిన వెంటనే UDISE వివరాలను నవీకరించి, అన్ని విద్యా డేటాబేస్‌లు ఖచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**పాఠ్యపుస్తకాల పంపిణీపై ప్రత్యేక సమీక్ష**

జిల్లాలో పాఠ్యపుస్తకాల పంపిణీ పురోగతిని సమీక్షిస్తూ, జిల్లాకు అవసరమైన పాఠ్యపుస్తకాలలో అధిక శాతం ఇప్పటికే మండలాలకు చేరినట్లు అధికారులు వివరించారు. మిగిలిన పుస్తకాల పంపిణీని వేగవంతం చేసి ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్, నోట్‌బుక్స్ సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గారు ఆదేశించారు. ప్రభుత్వం అందజేస్తున్న ప్రతి పాఠ్యపుస్తకం నిర్దేశిత విద్యార్థికే చేరేలా పర్యవేక్షించాలని, పుస్తకాల పంపిణీ వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

# కేజీబీవీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**నిర్మల్, జూన్ 19:**

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. శుక్రవారం దిలావర్‌పూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహం, హాజరు పట్టికలు, తరగతి గదులు, స్టోర్ రూమ్‌ను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. పలు సబ్జెక్టులపై ప్రశ్నలు అడిగి వారి విద్యా నైపుణ్యాలను పరీక్షించారు. నిల్వ ఉంచిన కూరగాయలు, వంట సరుకుల నాణ్యతను తనిఖీ చేసి, మెనూ ప్రకారం పోషకాహార భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన కలెక్టర్, భోజనం నాణ్యతపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో



డీఈవో భోజన్న, డీఆర్‌ఓ రాథోడ్ రమేష్, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# ఐఐటీ వారణాసిలో సీటు సాధించిన విద్యార్థిని అభినందించిన కలెక్టర్

**మెదక్, జూన్ 19**

మారుమూల తండా నుంచి చదువుకుని ప్రతిష్ఠాత్మక ఐఐటీ వారణాసి (బీహెచ్‌యూ)లో కంప్యూటింగ్ అండ్ మ్యాథమెటిక్స్ విభాగంలో ప్రవేశం పొందిన బడావత్ రాఘవేందర్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రతిమా సింగ్ అభినందించారు. విద్య ద్వారానే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పేర్కొంటూ, ఉన్నత విద్యకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు. తెలంగాణ ఈఏపీసెట్‌లో 2 వేల లోపు ర్యాంకు, జేఈఈ మెయిన్స్‌లో అర్హత సాధించి ఐఐటీలో సీటు పొందిన రాఘవేందర్ విద్యా ప్రస్థానం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ కొనియాడారు.

# క్షయ రహిత తెలంగాణే లక్ష్యం: మంత్రి దామోదర్ రాజనర్సింహ

**హైదరాబాద్, జూన్ 19**

క్షయ రహిత తెలంగాణ రాష్ట్ర నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి Jagat Prakash Nadda అధ్యక్షతన జరిగిన రాష్ట్రాల ఆరోగ్య మంత్రుల వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. తెలంగాణలో 2,492 గ్రామాల్లో క్షయ వ్యాధి నిర్మూలన కోసం హెల్త్ స్క్రీనింగ్ నిర్వహిస్తున్నామని మంత్రి వెల్లడించారు. క్షయ బాధితులకు చికిత్సతో పాటు పౌష్టికాహారం అందించేందుకు ఫుడ్ బాస్కెట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మాతా–శిశు సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, మాతృ మరణాలు, నవజాత శిశు మరణాల తగ్గింపునకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. హైరిస్క్ గర్భధారణలను ముందుగానే గుర్తించి గర్భిణులకు బర్త్ ప్లానింగ్ సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే 0–18 ఏళ్ల పిల్లలకు ఆర్‌బీఎస్‌కే బృందాల ద్వారా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, సికిల్ సెల్, తలసేమియా వంటి జన్యుపరమైన వ్యాధులను ముందస్తుగా గుర్తించేందుకు ప్రత్యేక స్క్రీనింగ్ చేపడుతున్నామని మంత్రి వివరించారు.



# కొడంగల్ బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల నాయకుల,డిజిటల్ సభ్యత్వ నమోదు



- SIR పై అవగాహన సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రులు మాజీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు


**కొడంగల్ మున్సిపల్, జూన్,19**

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో నిర్వహించిన SIR & బిఆర్ఎస్ పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు సమీక్ష సమావేశంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రా రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్ కొప్పుల మహేష్ రెడ్డి పట్నం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.ముందుగా కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో బిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరించి అదనతరం పార్టీ పెద్దలు కేసీఆర్ మార్గదర్శకత్వంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో విస్తృత స్థాయి సమావేశం జరిగింది.SIR ప్రక్రియను సమర్థంగా ముందుకు తీసుకెళ్లాలని, బూత్ స్థాయి BLA ల సమన్వయాన్ని బలోపేతం చేయాలని,సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని సూచన చేశారు.ప్రతి అర్హుడైన ఓటరుకు న్యాయం జరగాలి, సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి, బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలి అని వారు పిలుపునిచ్చారు. బిఆర్ఎస్ పార్టీ నుండి ప్రతి బూత్ కు ఇద్దరు బిఎల్ఎ లను కేటాయించడం జరిగిందని వారు సమర్థవంతంగా SIR మరియు డిజిటల్ సభ్యత్వ నమోదు ప్రక్రియను BLO లా వెంట ఉండి ఓటరు జాబితా ప్రక్రియను సమర్థవంతంగా పునరుదించాలని సూచించారు.

# క్యాన్సర్ చికిత్సలో మెరుగైన పద్ధతి..

## ఇకపై 40 శాతం మరణాలు నివారించవచ్చు

ప్రపంచ వ్యాప్తంగా సర్వైకల్ క్యాన్సర్‌తో బాధపడేవారి సంఖ్య నానాటికీ పెరుగుతుంది. దీనికి ప్రధాన కారణం చివరి దశలో ఈ క్యాన్సర్ గుర్తించడమే. అయితే తాజా పరిశోధనలు ఈ క్యాన్సర్ చికిత్సలో మెరుగైన పద్ధతిని కనుగొన్నారు. దీని ద్వారా 40 శాతం మరణాలను అడ్డుకోవచ్చంటున్నారు పరిశోధకులు.. మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్ సర్వసాధారణంగా మారుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. రొమ్ము క్యాన్సర్ తర్వాత, ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో అత్యధిక సంఖ్యలో గర్భాశయ క్యాన్సర్ కేసులు పెరుగుతుయి. మరణాల పరంగా రొమ్ము క్యాన్సర్ కంటే గర్భాశయ క్యాన్సర్ చాలా ప్రమాదకరమైనది. ఈ క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళల మరణాల సంఖ్య ఏటా పెరుగుతోంది. ఏటా దాదాపు 4 లక్షల మంది మహిళలు ఈ క్యాన్సర్‌తో మరణిస్తున్నారు. గర్భాశయ క్యాన్సర్ కేసుల్లో చాలా వరకు చివరి దశలో అభివృద్ధి చెందుతాయి. ఇది చికిత్సను కష్టతరం చేస్తుంది. దీంతో మహిళలు ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా పరిశోధకుల రీసెర్చ్ ఈ వ్యాధి చికిత్సలో గొప్ప విజయాన్ని సాధించారు. ఈ చికిత్సతో సర్వైకల్ క్యాన్సర్ మరణాలను 40 శాతం తగ్గించవచ్చని అంటున్నారు.



### ఈ కొత్త టెక్నాలజీతో సర్వైకల్ క్యాన్సర్ చికిత్స...

**పెరుగుతున్న గర్భాశయ క్యాన్సర్ కేసుల దృష్ట్యా.. వైద్యులు మెరుగైన చికిత్సను కనుగొనడానికి ప్రయత్నిస్తున్నారు. సంవత్సరాలుగా దానిపై అధ్యయనాలు చేస్తున్నారు. ఇటీవల వైద్యులు దాని చికిత్సలో సానుకూల ఫలితాలను పొందారు. ఈ పరిశోధనకు యూకే, మెక్సికో, భారత్, ఇటలీ, బ్రెజిల్‌లతో సహా 10 సంవత్సరాలకు పైగా ఈ క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళలను తీసుకున్నారు. ఈ చికిత్సలో కెమోరేడియేషన్‌కు ముందు కీమోథెరపీని చిన్న సెషన్‌లు ఇచ్చారు. యూనివర్సిటీ కాలేజ్ లండన్ నేతృత్వంలోని ఈ పరిశోధన మూడవ, నాల్గవ దశ క్యాన్సర్ చికిత్సలో చాలా మంచి ఫలితాలను చూపించింది. ఫలితంగా ఈ వ్యాధి నుండి మరణించే ప్రమాదాన్ని 40 శాతం తగ్గించవచ్చని తేలింది. పైగా ఈ క్యాన్సర్ మళ్లీ వచ్చే ప్రమాదం 35 శాతం తగ్గింది కూడా. మహిళలపై నిర్వహించిన ఈ పరిశోధన ఫేజ్ 3 ట్రయల్‌లో విజయవంతమైనట్లు పరిశోధకులు తెలిపారు. ఈ కొత్త చికిత్స విధానంపై పెద్ద ఎత్తున పరిశోధన చేయనప్పటికీ, ఈ పరిశోధన ఫలితాలు గర్భాశయ క్యాన్సర్ చికిత్సలో గొప్ప విజయంగా భావిస్తున్నారు.**



### ప్రతి ఏడాది 6,60,00 కొత్త గర్భాశయ క్యాన్సర్ కేసులు...

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. ప్రతి సంవత్సరం 6,60,00 కొత్త గర్భాశయ క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయి. ఈ క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళల్లో సగానికి పైగా మరణిస్తున్నారు. దీని బారిన పడిన స్త్రీలలో చాలా మంది దాదాపు 50 సంవత్సరాల వయస్సు గలవారు ఉంటున్నారు. 30 నుండి 40 శాతం కేసులలో ఈ క్యాన్సర్ నయమైన తర్వాత మళ్లీ తిరిగి వస్తుంది. రెండో సారి తిరగబెట్టినప్పుడు ఇది మరింత ప్రాణాంతకంగా మారి మరణానికి కారణమవుతుంది. గర్భాశయ క్యాన్సర్‌లో మరణాల సంఖ్య పెరగడానికి కారణం ఆలస్యంగా గుర్తించడమే. చాలామంది మహిళలు నాల్గవ దశలో ఈ క్యాన్సర్‌ను గుర్తిస్తున్నారు. కానీ ఇప్పుడు శాస్త్రవేత్తలు ఆధునాతన చికిత్సను కనుగొన్నారు. దీని ద్వారా క్యాన్సర్‌ను తొలినాళ్లలోనే గుర్తించి, చికిత్స చేసేందుకు సాధ్యమవుతుంది . తద్వారా మరణ ప్రమాదాన్ని తగ్గించవచ్చు.

### గర్భాశయ క్యాన్సర్‌ను ఎలా నివారించాలి...

- △ ధూమపానం మానుకోవాలి
- △ ఒకటి కంటే ఎక్కువ భాగస్వాములతో సంబంధాలు ఏర్పరచుకోకుండా ఉండటం
- △ చిన్నవయసులోనే శారీరక సంబంధాలు పెట్టుకోకపోవడం మంచిది
- △ గర్భనిరోధక మాత్రలు ఎక్కువగా తీసుకోకూడదు
- △ సర్వైకల్ క్యాన్సర్‌ను పరీక్షించడానికి ఎప్పటికప్పుడు పాప్ స్మియర్ పరీక్ష చేయించుకోవాలి
- △ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించడానికి టీకాలు వేయించుకోవాలి

### గర్భాశయ క్యాన్సర్ ఎందుకు వస్తుంది...?

- △ ఒకటి కంటే ఎక్కువ భాగస్వాములతో సంబంధాలను కలిగి ఉండటం
- △ ధూమపానం
- △ గర్భనిరోధక మాత్రలు అధికంగా తీసుకోవడం కలిగి ఉండటం



## వెన్నునొప్పితో బాధపడుతున్నారా?


# ఇలా చేస్తే ఉపశమనమే..



ప్రస్తుత రోజుల్లో చాలామంది ఒకే చోట కదలకుండా గంటల తరబడి కూర్చుని పనిచేస్తుంటారు. దీని వల్ల వెన్నెముక సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్యలను ఇలాగే వదిలేస్తే అనతి కాలంలోనే సమస్య తీవ్రం అవుతుంది. ఇలా అవకుండా ఉండాలంటే.. గంటల తరబడి ఒకేచోట పనిచేయడం వల్ల వెన్నుపాము నొప్పి రావడం సాధారణ సమస్యగా మారింది. ఈ సమస్య ప్రతి ఒక్కరిని ఇబ్బంది పెడుతుంది. కానీ కొంతమందిలో ఇది చాలా కాలం పాటు కొనసాగుతుంది. దీనివల్ల ఏ పని చేయాలన్నా ఇబ్బందులు పడుతుంటారు. చాలా మంది వెన్నెముక నొప్పిని నిర్లక్ష్యం చేస్తుంటారు. కొన్ని సందర్భాల్లో వెన్నెముక కూడా దెబ్బతింటుంది. దీని కారణంగా హెర్నియేటెడ్ డిస్క్, వెన్నునొప్పి, పార్శ్వగూని వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. వెన్నెముక నొప్పిని నిర్లక్ష్యం చేయకూడదని ఢిల్లీలోని ఇండియన్ స్పైనల్ ఇంజూరీస్ సెంటర్‌లో వెన్నెముక సేవల చీఫ్ డాక్టర్ వికాస్ టాండన్ అంటున్నారు. ఈ సమస్య చాలా కాలం పాటు కొనసాగితే, కీళ్లనొప్పులు, వెన్నుపాము దెబ్బతినడానికి కూడా దారితీయవచ్చు. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ చిరోప్రాక్టిక్ ద్వారా అక్టోబర్ 16న ప్రపంచ వెన్నెముక దినోత్సవాన్ని జరుపుకుంటామని డాక్టర్ వికాస్ టాండన్ వివరించారు. ఇది 2008లో ప్రారంభమైంది. వెన్నెముకకు సంబంధించిన వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడమే దీని ఉద్దేశం. గంటల తరబడి కూర్చొని పనిచేయడం, చెడు భంగిమ, బలహీనమైన జీవనశైలి, గాయం వెన్నెముకలో నొప్పికి కారణమవుతుందని డాక్టర్ వికాస్ వివరిస్తున్నారు. ఈ నొప్పి ప్రారంభంలో స్వల్పంగా ఉంటుంది. తరువాత క్రమంగా పెరుగుతుంది. కానీ దానిని విస్మరించకూడదు. వెన్నెముకకు సంబంధించిన ఎలాంటి సమస్య రాకుండా ఉండాలంటే మంచి భంగిమలో కూర్చోవాలి. లేవడం, కూర్చోవడం, నడిచే విధానం సరిగ్గా ఉండాలి. సరిగ్గా కూర్చోవడం మన మెదడుపై అనేక విధాలుగా సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. ఇది వెన్నెముక సంబంధిత సమస్యల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. నిటారుగా కూర్చోవడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుంది. నిటారుగా కూర్చుంటే శరీరంలో కార్టిసాల్ హార్మోన్ స్థాయి తగ్గుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది మానసిక ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. వెన్నెముకకు సంబంధించిన ఎలాంటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు జీవనశైలిని చక్కగా ఉంచుకోవాలి. ప్రతిరోజూ యోగా చేయాలి. పోషకాహారం తీసుకోవాలి. ముఖ్యంగా ఆహారంలో కాల్షియం, విటమిన్ డి అధికంగా ఉండే వాటిని చేర్చుకోవాలి.

# గర్భిణీలు స్మోకింగ్ చేస్తే.. అతి ప్రమాదకరం

పొగతాగడం ఆరోగ్యానికి ఎంతో హానికరమని అందరికీ తెలిసిందే. ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలకు స్మోకింగ్ ప్రధాన కారణం. అందుకే ఈ అలవాటును మానుకోవాలని వైద్యులు సూచిస్తుంటారు. గుండె సంబంధిత సమస్యలు మొదలు ఎముకలు, మెదడు ఆరోగ్యంపై కూడా స్మోకింగ్ తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. అయితే గర్భిణీలు ఒకవేళ స్మోకింగ్ చేస్తే మరింత ప్రమాదకరమని నిపుణులు అంటున్నారు. ఇందుకు సంబంధించి తాజాగా చైనాకు చెందిన ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. తాజాగా నిర్వహించిన ఓ సర్వేలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. స్మోకింగ్ వల్ల గర్భిణులకు తీవ్ర అనర్థాలు తప్పవని అంటున్నారు. సిగరెట్ పొగలో ఏకంగా నాలుగు వేల రకాల రసాయనాలు ఉంటాయి.



**సాధారణంగా స్మోకింగ్ చేసే వారిలో ఈ రసాయనాలు రక్తంలో కలిసిపోతాయి. దీంతో ఈ రసాయనాలు ప్లాసెంటా ద్వారా కడుపులోని పిండాన్ని చేరుతాయి. ఇది శిశువు ఎగుదలకు, మానసిక అభివృద్ధికి తీవ్రమైన ఇబ్బందులు కలిగిస్తాయని అధ్యయనంలో తేలింది. అంతేకాకుండా స్మోకింగ్ చేయడం వల్ల గర్బిణీ హృదయ స్పందనల రేటుపై కూడా ప్రభావం పడుతుంది. దీంతో డెలివరీ సమయంలో తల్లి ఆరోగ్యంపై ఇది తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది.**

అయితే గర్భం దాల్చకముందు సిగరెట్ అలవాటు ఉండి. గర్భం దాల్చిన తర్వాత మానేసినా ఈ సమస్య వచ్చే అవకాశం 27 శాతం ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. గర్భం దాల్చిన సమయంలో కూడా స్మోకింగ్ చేస్తే ఈ ముప్పు 31 శాతం నుంచి 32 శాతం వరకు ఉంటుందని సర్వేలో తేలింది. గర్భిణీలు స్మోకింగ్ చేస్తే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై కచ్చితంగా నేరుగా ప్రమాదం పడుతుందని, తల్లి కావాలనుకునే వారు కనీసం 6 నెలల ముందు నుంచి ఈ అలవాటును మానేయడం ఉత్తమం అని చెబుతున్నారు.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.